ఈనాడు
శ్రీ సత్యసాయి
శనివారం అక్టోబరు 26, 2024 7

తాగునీటి ట్యాంకులు శుభ్రం చేయించండి: కలెక్టర్


పుట్టపర్తి, న్యూస్‌టుడే : జిల్లా వ్యాప్తంగా తాగునీటి ట్యాంకులను రెండ్రోజుల్లో శుభ్రం చేయించాలని కలెక్టర్ టీఎస్ చేతన్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టర్ పుట్టపర్తిలోని తన క్యాంపు కార్యాలయం నుంచి అధికారులతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. వారం రోజులుగా జిల్లాలో ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షాల నేపథ్యంలో కలుషిత నీరు, కాలానుగుణ వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించాలని డీపీఓ, డీఎంహెచ్ఓ, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు, మున్సిపాలిటీ కమిషనర్లకు సూచించారు. గ్రామాల్లో పారిశుద్ధ్య చర్యలు, తాగునీటి ట్యాంకుల శుభ్రత విషయంలో పంచాయతీ కార్యదర్శులు బాధ్యతగా పనిచేయాలన్నారు. జిల్లాలో ఎక్కడా తాగునీటి పైపులైన్లు లీకేజీలు లేకుండా చూడాలని ఆదేశించారు. దోమల నివారణకు ఫాగింగ్ చేయించాలన్నారు. ఎక్కడా నీటి నిల్వలు లేకుండా చూడాలని మున్సిపల్ కమిషనర్లను ఆదేశించారు. ఇంటింటా సర్వే చేపట్టి వైద్యసేవలందించాలని కలెక్టర్ సూచించారు. కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి మంజువాణి, డీసీహెచ్ఓ తిప్పేంద్రనాయక్, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారి మల్లికార్జునప్ప తదితరులు పాల్గొన్నారు.

కార్డుదారులకు కందిపప్పు వచ్చేసింది

ఉమ్మడి జిల్లాకు 1,215 మెట్రిక్ టన్నులు

రాంనగర్, (అనంతపురం) న్యూస్‌టుడే : గత వైకాపా ప్రభుత్వం కార్డుదారులకు కందిపప్పు ఎగ్గొట్టింది. బహిరంగ మార్కెట్‌లో పప్పు ధరలు పెరిగిపోయాయి. పేద, మధ్య తరగతి కుటుంబాలకు పప్పన్నం దూరం చేశారు. కొని తినలేని పరిస్థితి. కూటమి ప్రభుత్వం అధికారంలో వచ్చాక రాష్ట్ర స్థాయిలోనే టెండర్లు పిలిచారు. కచ్చిత తూకాలు, నాణ్యమైన సరకు సరఫరా చేసే గుత్తేదారులకు బాధ్యతలు అప్పగించారు. ఈ నెలలో 50 శాతం కందిపప్పు పంపిణీ చేశారు. నవంబరుకు పూర్తిస్థాయిలో ఎంఎల్ఎస్ పాయింట్లకు చేరింది. ఇప్పటికే పౌరసరఫరాల సంస్థ అధికారులు చౌకధరల దుకాణాలకు జోరుగా సరఫరా సాగుతోంది. బియ్యంతోపాటు కందిపప్పు, పంచదార, జొన్నలు పంపిణీ చేయనున్నారు.

ఉమ్మడి అనంతపురం జిల్లాలో చౌకధరల దుకాణాలు	3,012
కార్డులు సంఖ్య	12,08,293



బియ్యం బదులు జొన్నలు

వచ్చే నెల నుంచి అన్ని కార్డులపై కిలో రూ.67 చొప్పున కందిపప్పు అందించేందుకు చర్యలు తీసుకుంటున్నారు. ఏఏవై కార్డుదారులకు పంచదార కిలో రూ.14, మిగిలిన కార్డుదారులకు అరకిలో రూ.17, చొప్పున అందించనున్నారు. బియ్యం బదులు జొన్నలు చౌకధరల దుకాణాల్లో అందుబాటులో ఉంచారు. ప్రతి కార్డుదారునికి 3 కిలోల చొప్పున పంపిణీ చేయనున్నారు.

బఫర్ నిల్వలు తొలగించండి

వైకాపా ప్రభుత్వ హయాంలో డీలర్లు బియ్యం అమ్ముకున్నారు. పౌరసరఫరాల సంస్థ అధికారులు బఫర్ నిల్వలు పట్టుకుని చౌకధరల దుకాణాలకు బియ్యం సరఫరా చేస్తున్నారు. కార్డుదారులకు బియ్యం తూకాల్లో తక్కువ వేయడంతో ఇబ్బందిగా మారిందని కొత్త డీలర్లు వాపోతున్నారు. వైకాపా ప్రభుత్వంలో డీలర్లు బియ్యం అమ్ముకున్నారని, కూటమి ప్రభుత్వంలో నియమించిన డీలర్లతో ఆ సొమ్ము వసూలు చేస్తున్నారనే అంశంలో వివాదం నెలకొంది. అక్రమాలకు పాల్పడిన వారిపై చర్యలు తీసుకోకపోవడం గమనార్హం.

సీకే పల్లిలో ఆక్రమణల పరంపర


రహదారి పక్కన ఏర్పాటు చేసిన దుకాణాలు

చెన్నేకొత్తపల్లి, న్యూస్‌టుడే: సీకేపల్లిలో పంచాయతీ, రవాణా, భవనాల శాఖ దారి స్థలాల ఆక్రమణలు ఆగడం లేదు. సీకేపల్లి 44వ జాతీయ రహదారి కూడలి నుంచి పెనుకొండకు వెళ్లే దారిలో పాత సినిమా టెంట్ వరకు ఆక్రమణలు ఉన్నాయి. ఆయా ప్రాంతాల్లో గ్రామానికి చెందిన కొందరు రాజకీయ నేతల ప్రోద్బలంతో దుకాణాలు ఏర్పాటు చేశారు. మరికొందరు బతుకుదెరువుకు దుకాణాలు ఏర్పాటు చేసుకుంటే, మరికొందరు నెలనెలా బాడుగ దందాలు చేస్తున్నారు.

- సీకేపల్లికి దగ్గరలోని గుట్టూరు వద్ద కియా కార్ల పరిశ్రమ ఉండటం, ఇటీవల మద్యం దుకాణాన్ని సైతం సీకేపల్లి 44వ జాతీయ రహదారికి సమీపంలోనే ఏర్పాటు చేశారు. మరోవైపు కబ్జాపర్వం కొనసాగుతోంది. ఫలితంగా పాదచారులు, వాహనదారులు, విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పంచాయతీ అధికారులు పట్టించుకోకపోవడం వల్లే ఆక్రమణదారులు పేట్రేగిపోతున్నారని స్థానికులు విమర్శిస్తున్నారు.

బాడుగల దందా..

సీకేపల్లిలోకి ప్రవేశించే ప్రదేశం నుంచి సినిమా టెంట్ వరకు రహదారికి ఇరువైపులా పలువురు దుకాణాలు ఏర్పాటు చేశారు. వాటిని ఇతరులకు బాడుగలకు ఇచ్చి నెలనెలా బాడుగ దందా చేస్తున్నారు. చిన్న దుకాణానికి సైతం డిమాండ్‌ను బట్టి రూ.20 నుంచి రూ.50 వేల వరకు అడ్వాన్సులు, రూ.2 నుంచి రూ.5 వేల బాడుగలు వసూలు చేస్తున్నారు. రాజకీయ పార్టీల నేతలు, అధికార దర్పంతో దుకాణాలు ఏర్పాటు చేస్తున్నారు. దాదాపు 25 దుకాణాలు ఉండగా వాటిలో 18 బాడుగలకు ఇచ్చినవే.

అధికారులు స్పందించాలి



గ్రామంలో దారి పక్కనున్న స్థలాలతో పాటు వీధిదారులను సైతం ఆక్రమించి నిర్మాణాలు చేపట్టారు. ఆక్రమ నిర్మాణాలు తొలగించేందుకు సత్వరమే అధికారులు చర్యలు తీసుకోవాలి. పంచాయతీ, ర.భ.శా దారి స్థలాలను ఆక్రమించి దుకాణాల ఏర్పాటుతో బాడుగల దందా కొనసాగిస్తున్నవారి ఆటలు కట్టించాలి. దుకాణాలను తొలగించి అభివృద్ధి పనులు చేపట్టాలి. **- చెన్నకేశవగౌడ్, స్థానికుడు**

చర్యలు చేపడతాం

రహదారిని ఆక్రమించి చేపట్టిన నిర్మాణాలను తొలగించేందుకు చర్యలు చేపడతాం. దారికి ఇరువైపులా ఉన్న నిర్మాణాలను పరిశీలించి, పంచాయతీ రాజ్ చట్టం ప్రకారం ఆక్రమణదారులపై చర్యలు తీసుకుంటాం.

- నారాయణస్వామి, పంచాయతీ కార్యదర్శి

'తెదేపా సభ్యత్వాన్ని విజయవంతం చేయండి'

హిందూపురం: జిల్లాలో శనివారం నుంచి ప్రారంభమయ్యే తెదేపా సభ్యత్వ నమోదు విజయవంతం అయ్యేలా కృషి చేయాలని పార్టీ జిల్లా అధ్యక్షుడు కొల్లకుంట అంజినప్ప పిలుపునిచ్చారు. వాట్సప్‌లో 9053419999, 9134100009 నెంబర్లు, టెలిగ్రామ్‌లో మై టీడీపీ బాట్ ద్వారా సభ్యత్వం నమోదు చేసుకోవచ్చన్నారు.

పీజీ సీట్లు 1064.. భర్తీ 296

ఎస్కేయూలో ప్రవేశాలు అంతంతే..



ఎస్కేయూ, న్యూస్‌టుడే

శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయలో ఎంఏ, ఎంకాం, ఎమ్మెస్సీ కోర్సుల్లో ప్రవేశాలు గణనీయంగా తగ్గాయి. మొత్తం 33 విభాగాలకుగాను 1064 పీజీ సీట్లు ఉన్నాయి. అందులో 296 మంది విద్యార్థులే ప్రవేశం పొందారు. 2024-పీజీసెట్ కౌన్సెలింగ్ ముగిసింది. సీట్లు మిగిలిపోవడంతో ఈనెల 19 నుంచి తక్షణ ప్రవేశాల ప్రక్రియ నిర్వహించారు. కేవలం 15 మంది విద్యార్థులు చేరారు. మొత్తంగా 768 సీట్లు భర్తీ కాలేదు. సైన్స్ కోర్సుల్లో ప్రవేశాలు తగ్గిపోయాయి. ఇందులో 18 విభాగాలకు సంబంధించి 454 సీట్లు ఉండగా 206.. ఆర్ట్స్ గ్రూపుల్లో 610 సీట్లకుగాను 90 భర్తీ అయ్యాయి. 50 శాతం కూడా కాలేదు. 2023-24 విద్యాసంవత్సరంలో పరిశీలిస్తే 320 మంది ప్రవేశాలు పొందారు. ఈసారి గతేడాది కన్నా తక్కువగా ఉండటం గమనార్హం.

- పీజీ కోర్సుల్లో అప్లయిడ్ మ్యాథమాటిక్స్, పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్, అప్లయిడ్ ఎకనామిక్స్, వ్యాయామవిద్యలో ఒక్క విద్యార్థి చేరలేదు.
- పాలిమార్ సైన్స్‌లో ఒకరు, వయోజన విద్యలో ఇద్దరు, తెలుగు, హిందీ, గ్రామీణాభివృద్ధిలో ముగ్గురు చొప్పున విద్యార్థులు చేరారు. గతంలో ఆయా కోర్సుల్లో ప్రవేశాలు లభించడమే కష్టంగా ఉండేది. ప్రస్తుతం పరిస్థితి పూర్తిగా మారిపోయింది.

గత వైకాపా ప్రభుత్వ నిర్వాకంతో...

గతంలో పీజీ, పీహెచ్‌డీ ప్రవేశాలకు ఎస్కేయూ సెట్ నిర్వహించేవారు. ఉమ్మడి అనంతపురం, కర్నూలు జిల్లాల విద్యార్థులు ఎస్కేయూలో చేరడానికి ఆసక్తి చూపేవారు. గత వైకాపా ప్రభుత్వం అన్ని విశ్వవిద్యాలయాలకు కలిపి రాష్ట్ర వ్యాప్తంగా పీజీసెట్ నిర్వహిస్తూ వచ్చింది. ఏ విశ్వవిద్యాలయంలో సీటు వస్తుందో తెలియని పరిస్థితి. దూరంగా ఉన్న జిల్లాల విద్యార్థులు ఎస్కేయూకు రావడానికి ఇబ్బందిగా మారింది. గతంలో విద్యార్థులకు ప్రభుత్వం అందించే బోధన ఫీజులు, ఉపకారవేతనాలు వర్సిటీ ఖాతాలో జమ చేసేవారు. జగన్ ప్రభుత్వం ఉపకారవేతనాలు, బోధనారుసుం విద్యార్థుల తల్లుల ఖాతాలో వేస్తున్నట్లు ప్రకటించింది. ఏడాదికి రెండుసార్లు జమ చేస్తున్నట్లు చెప్పారు. సక్రమంగా జమ చేయకపోవడంతో విద్యార్థుల తల్లిదండ్రులపై భారం పడుతోంది. గ్రామీణ, పేద విద్యార్థులు చేరడానికి ఆసక్తి చూపడంలేదు. మరోవైపు ఖాళీగా ఉన్న బోధన ఉద్యోగాలు భర్తీ చేయలేదు. బోధన సక్రమంగా లేకపోవడంతో విద్యార్థులు ఎస్కేయూలో చేరడానికి ఆసక్తి చూపడం లేదు.

విభిన్న ఉత్పత్తులకు విస్తృత మార్కెటింగ్

● ఇంటి నుంచే ఆన్‌లైన్ వ్యాపారం ● మహిళల ఉపాధికి ఊతం

అశోక్‌నగర్ (అనంత సంక్షేమం), న్యూస్‌టుడే: పరిశ్రమలు పెట్టి ఉత్పత్తులను సులువుగా తయారు చేసినా మార్కెటింగ్ చేయడం కష్టతరమయ్యేది. డ్వాక్రా మహిళా గ్రూపులు తయారు చేసిన వాటికి సరైన మార్కెటింగ్ సౌకర్యం ఉండేది కాదు. దీంతో విభిన్నంగా ఉన్నా స్థానికంగానే విక్రయించుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మహిళల ఆర్థికాభివృద్ధిపై దృష్టి సారించారు. పలు సరికొత్త మార్కెటింగ్ విధానాలను తెరపైకి తీసుకొచ్చి మహిళలను ఔత్సాహిక పారిశ్రామికవేత్తగా తీర్చిదిద్దే దిశగా తొలి అడుగుపడింది. ఇప్పుడు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో మార్కెటింగ్ అవకాశాలు కల్పించి. ఈ-కామర్స్‌లో విక్రయించుకొనే విధంగా అవకాశాలు కల్పించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు సెర్ప్ అధికారులకు ఆదేశాలు ఇచ్చారు. ఇందుకు అనుగుణంగా అధికార యంత్రాంగం కసరత్తు ప్రారంభించింది.



అలంకరణ సామాగ్రి తయారుచేస్తూ..

గుర్తించిన ఉత్పత్తులివీ..

గృహాలంకరణ వస్తువులు, తినుబండారాలు ఏవైనా గ్లోబల్ మార్కెట్‌లో ప్రవేశించాలంటే ఓపెన్ నెట్‌వర్క్ ఫర్ డిజిటల్ కామర్స్ (ఓఎన్‌డీసీ) వేదిక ద్వారా సాధ్యం. ఈ విధానంలో ఇంట్లో నుంచే విక్రయాలు సాగించవచ్చు. ప్రస్తుతం లావాదేవీలు ఆన్‌లైన్ డిజిటల్ తరహాలో ఉన్నాయి.

- గార్లదిన్నె, నార్పల, రాప్తాడు, బుక్కరాయసముద్రం, అనంతపురం, డి.హీరేహాళ్, యాడికి, కంబదూరు, పామిడి తదితర ప్రాంతాల్లో వేరుసెనగ, ఆముదం, సన్‌ఫ్లవర్ నూనెలు, పట్టు చీరలు, వాటర్ బాటిళ్లు, డోర్ కర్టెన్లు, గార్మెంట్స్, ఫినాయిల్, స్వీట్లు, బిస్కెట్లు, మిల్లెట్స్, ఫ్లోర్ క్లీనర్ టూవీలర్ బ్యాగులు, లెదర్ బొమ్మలు, బెల్లం, మసాల పౌడర్లు గుర్తించారు. నాణ్యత, నవ్యతతో కూడిన ఉత్పత్తులకు ఎక్కడైనా డిమాండ్ ఉంటుంది. పలు రకాల ఉత్పత్తులు మంచి గుర్తింపు వస్తోంది.
- గార్లదిన్నెలో చిరుధాన్యాలతో తయారు చేసిన రాగి మాల్టు, చిక్కీలు, నిప్పట్లు ఇప్పటికే ఓఎన్‌డీసీలో పొందుపరిచారు.
- రుద్రంపేటలో తయారు చేసే గిఫ్టులు, గృహ అలంకరణ వస్తువులను ఆన్‌లైన్‌లో ఉంచారు.
- రాప్తాడు మండలంలో బిస్కెట్లు తయారీలో మహిళలు ముందుంటున్నారు. జన్మభూమి నగర్‌కు చెందిన ముత్యాలమ్మ మహిళా సంఘం సభ్యురాలు సుమియా డోర్ డెకరేషన్ ఫ్లవర్స్‌ను ఉత్పత్తి చేస్తూ అమ్మకాల్లో ముందుంటోంది.



బుక్కరాయ సముద్రంలో గంగేశ్వరి నిర్వహిస్తున్న ఫ్లోర్ క్లీనింగ్ యూనిట్‌ను పరిశీలిసున్న డీపీఎం గంగాధర్

రెండు రకాలుగా విక్రయాలు



అనంతపురం బళ్లారి బైపాస్‌లో దుకాణం ఏర్పాటు చేశాం. 8 సంవత్సరాలుగా దీన్ని నిర్వహిస్తున్నాం. ఓఎన్‌డీసీతో పొందు పరచడంతో బాగా ఉపయోగ ఉంటోంది. షాపులో అమ్మడంతోపాటు ఆన్‌లైన్‌లో కూడా విక్రయాలు సాగిస్తున్నాం. **- ఖైరున్‌బీ, అనంతపురం**

నిరంతర ప్రక్రియ

- ఈశ్వరయ్య, డీఆర్‌డీఏ పీడీ

కలెక్టరు ఆదేశాల మేరకు జిల్లాలో తయారు అవుతున్న ఉత్పత్తుల్ని గుర్తించే ప్రక్రియ సాగుతోంది. ప్రధానంగా ప్రతి ఉత్పత్తికి బ్రాండ్ పేరు ఉండటంతోపాటు మెయిల్ ఐడీ, ఫోన్ నంబరు, పాన్‌కార్డు, ఉద్యామ్ సర్టిఫికెట్, ఫుడ్ ప్రొడక్ట్ ఎంఎస్‌ఎంఈ సర్టిఫికెట్, జీఎస్టీ, బ్యాంకు ఖాతా, ఉత్పత్తి చేసిన వాటికి సంబంధించి చూడటానికి ఆన్‌లైన్‌లో బాగా కన్పించే విధంగా మంచి ఫొటోలు, ధర, తూకం వివరాలన్నీ డీఆర్‌డీఏ అధికారులకు అందజేస్తే ఓఎన్‌డీసీలో పొందు పరుస్తారు.

జూనియర్ న్యాయవాదులు మనోధైర్యాన్ని కోల్పోవద్దు

జిల్లా ప్రధాన న్యాయమూర్తి శ్రీనివాస్

అనంతపురం (లీగల్), న్యూస్‌టుడే: జూనియర్ న్యాయవాదులు మనోధైర్యాన్ని కోల్పోరాదని జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి.శ్రీనివాస్ అన్నారు. జూనియర్ న్యాయవాది రుక్సానా మృతికి నివాళులు అర్పిస్తూ జిల్లా కోర్టులో సంతాప సభ నిర్వహించారు. ఈ సభకు న్యాయమూర్తులు, న్యాయవాదులు హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి.శ్రీనివాస్ మాట్లాడుతూ.. రుక్సానా మృతి ఆ కుటుంబానికి తీరని లోటని అన్నారు. ఆర్థిక ఇబ్బందులు, వృత్తిలో ఆటుపోట్లతో రుక్సానా మనోధైర్యాన్ని కోల్పోయిందనే భావన వ్యక్తం అవుతోందన్నారు. జూనియర్ న్యాయవాదులు వృత్తిలో ఇబ్బందులు పడకుండా సీనియర్ న్యాయవాదులు ప్రోత్సహిస్తూ మనోధైర్యాన్ని నింపాలన్నారు. ఆమె మృతి ఘటనపై నిష్పక్షపాతంగా, లోతుగా దర్యాప్తు చేపట్టాలని ఇప్పటికే పోలీసు ఉన్నతాధికారులకు సూచించామన్నారు. ఆమె తీసుకున్న నిర్ణయంతో కష్టపడి చదివించిన తల్లిదండ్రులకు తీరని శోకం మిగిల్చిందన్నారు. జూనియర్ న్యాయవాదులు ఎలాంటి కష్టాలు వచ్చినా న్యాయసేవా సదన్‌లో అధికారుల దృష్టికి తీసుకెళ్లాలన్నారు. బార్ అసోసియేషన్ అధ్యక్షులు గురుప్రసాద్, సీనియర్ న్యాయవాదులు వి.జె.రవికుమార్, పీజీ విఠల్, బి.నారాయణరెడ్డి, ఎల్.ప్రభాకర్‌రెడ్డి మాట్లాడారు. న్యాయమూర్తులు సత్యవాణి, శోభారాణి, శివప్రసాద్ యాదవ్, శివశంకర్, సుబ్బారావు, సుజిన్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

'పంటల బీమా ప్రీమియం రైతులే చెల్లించాలి'

పుట్టపర్తి: రబీ సీజన్‌లో వరి, వేరుసెగన, టమాటా పంటలు సాగు చేసే రైతులే పంటల బీమా చేయించుకోవాలని కలెక్టర్ టీఎస్‌చేతన్ తెలిపారు. వరికి డిసెంబర్ ఆఖరిలోపు, వేరుసెనగ, టమాటా పంటలకు డిసెంబరు 15 లోపు నమోదు చేసుకోవాలన్నారు. శుక్రవారం స్థానిక కలెక్టరేట్‌లో వ్యవసాయ అనుబంధ శాఖలు, బీమా అధికారులతో కలెక్టర్ సమావేశం నిర్వహించారు. వరికి రూ.630, వేరుసెనగ రూ.480, టమాటాకు రూ.1,600 ప్రీమియం రైతులే చెల్లించాలన్నారు. మీసేవా, సచివాలయాల్లో రైతులు బీమా ప్రీమియం చెల్లించవచ్చన్నారు. ఇటీవల కురిసిన వర్షాలకు జరిగిన పంట నష్టం వివరాలను రైతు సేవా కేంద్రాలు, సచివాలయాల్లో ప్రదర్శించాలని సూచించారు. జిల్లా వ్యవసాయ శాఖాధికారి వైవీ సుబ్బారావు, సీపీఓ విజయ్‌కుమార్, జిల్లా ఉద్యాన అధికారి చంద్రశేఖర్, డీఎం రమణకుమార్ పాల్గొన్నారు.

అనంతపురం మీదుగా ప్రత్యేక రైళ్లు

గుంతకల్లు, న్యూస్‌టుడే : పండగల సందర్భంగా ప్రయాణికుల రద్దీని అధిగమించడానికి ప్రత్యేక రైళ్లను నడుపుతున్నట్లు గుంతకల్లు డివిజన్ అధికారులు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. రెండు ప్రత్యేక రైళ్లు అనంతపురం మీదుగా ప్రయాణిస్తాయని చెప్పారు. ఛప్రా- యశ్వంతపూర్ మధ్య నవంబరు 2, 9వ తేదీల్లో ప్రయాణించే రైలు (05185) కర్నూలు, అనంతపురం, ధర్మవరం మీదుగా ప్రయాణించనుంది. ఇక యశ్వంతపూర్ నుంచి ఛప్రాకు రైలు (05186) అక్టోబరు 4, 11వ తేదీల్లో అనంతపురం మీదుగా ఇదే మార్గంలో ప్రయాణిస్తుందని అధికారులు వివరించారు.

రానున్న మూడు రోజుల్లో తేలికపాటి వర్షాలు

బుక్కరాయసముద్రం, న్యూస్‌టుడే: రానున్న మూడు రోజుల్లో ఉమ్మడి అనంతపురం జిల్లాలో చిరుజల్లుల నుంచి ఓ మోస్తరు తేలికపాటి వర్షాలు కురిసే అవకాశం ఉందని రేకులకుంట వాతావరణ కేంద్రం శాస్త్రవేత్తలు విజయశంకర్‌బాబు, నారాయణస్వామి తెలిపారు. వచ్చే ఐదు రోజులు జిల్లాలో పగటి ఉష్ణోగ్రతలు 32.8 నుంచి 33.6 డిగ్రీలుగానూ, రాత్రి ఉష్ణోగ్రతలు 21.1 నుంచి 22.4 డిగ్రీలుగా నమోదవ్వనున్నాయి. వాయువ్యం దిశగా గాలులు గంటకు 3 కిలోమీటర్ల వేగంతో వీస్తాయన్నారు. ఉదయం పూట గాలిలో తేమ 81 శాతం, మధ్యాహ్నం పూట 49 శాతం నమోదవుతుందని శాస్త్రవేత్తలు తెలిపారు.

తోపుదుర్తి భూ మాఫియా బాధితులకు న్యాయం చేస్తాం

ఎమ్మెల్యే పరిటాల సునీత

చెన్నేకొత్తపల్లి, న్యూస్‌టుడే: తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డికి ఎమ్మెల్యేగా అవకాశం ఇస్తే మంచి చేస్తారని ఆశించిన ప్రజలకు భూ మాఫియా పాలన అంటే ఏమిటో చూపించారని ఎమ్మెల్యే పరిటాల సునీత దుయ్యబట్టారు. సీకేపల్లి ఎంపీడీఓ కార్యాలయంలో శుక్రవారం ప్రజా రెవెన్యూ దర్బార్ భూ సమస్య పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి హాజరైన ఎమ్మెల్యే ఆర్డీఓ మహేష్‌తో కలిసి భూ బాధితులు, రైతుల సమస్యలపై వినతులు స్వీకరించారు. మండలంలోని 13 రెవెన్యూ గ్రామాల నుంచి 157 మంది బాధితులు వివిధ సమస్యలపై వినతిపత్రాలు అందజేశారు. అవకాశం ఉన్న వాటికి వెంటనే పరిష్కారం చూపాలని, మిగతా వాటిని నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని ఆర్డీఓ, తహసీల్దార్ సురేశ్ కుమార్‌కు ఎమ్మెల్యే సూచించారు. సీకేపల్లి మండలంలో వైకాపా పాలనంతా భూ మాఫియా, దందాలు, పంచాయితీలతోనే సాగిందని ఆక్షేపించారు. జాతీయ రహదారి పక్కనున్న ఓ దాబాను అనధికార రెవెన్యూ కార్యాలయంగా చేసుకుని అక్రమాలు చేశారన్నారు. వీఆర్వో మహేశ్వరరెడ్డి తతంగమంతా నడిపించారన్నారు. అలాంటి వ్యక్తిపై చర్యలు తీసుకోవాల్సిన అధికారులు పదోన్నతి కల్పించి మండలానికి ఎలా బదిలీ చేస్తారని ప్రశ్నించారు. దశాబ్దాల నుంచి సాగులో ఉన్న భూముల రైతుల వివరాలు రాత్రికి రాత్రే మార్చేశారని, ఆ దిశగా అధికారులను ఆశ్రయిస్తే స్పందించని పరిస్థితి అన్నారు. పోలీసుల వద్దకు వెళితే బాధితులనే బెదిరించిన సంఘటనలు ఉన్నాయన్నారు. తోపుదుర్తి భూ బాధితులకు న్యాయం చేయడంతోపాటు, వారు చేసిన భూ అన్యాయ, అక్రమాలను వెలుగులోకి తెస్తామన్నారు.



ఎమ్మెల్యే పరిటాల సునీత, ఆర్డీఓ మహేష్‌కు సమస్యలు వివరిస్తున్న బాధిత రైతులు

ఎడ్లబండ్ల పోటీల్లో అపశ్రుతి

ఒక ఎద్దు మృత్యువాత, మరోదానికి విరిగిన కొమ్ము

సోమందేపల్లి: మండలంలోని వెలగమేకలపల్లి మలుపు సమీపంలో శుక్రవారం నిర్వహించిన ఎడ్లబండ్ల పోటీల్లో అపశ్రుతి చోటుచేసుకుంది. పోటీలో నెలకొన్న ప్రమాదాల్లో కొత్తచెరువు రైతు నాగప్పకు చెందిన ఒక ఎద్దు చనిపోగా, కర్ణాటకలోని గౌరిబిదనూరు రైతు లక్ష్మీపతికి చెందిన ఎద్దుకు కొమ్ము విరిగింది. ఆయా రైతుల కుటుంబ సభ్యులు, బంధువులు కంటతడి పెడుతూ విషాదంలో మునిగిపోయారు. ముందుగా గంగమ్మ అమ్మవారికి పూజల అనంతరం మంత్రి సవిత భర్త, తెదేపా నాయకుడు వెంకటేశ్వరరావు, ఎస్సై రమేశ్‌బాబు, వెంకటరమణ, చంద్రశేఖర్, సిద్ధలింగప్ప, వెంకటేశులు, రంగప్ప, నరసింహులు, గోవిందు తదితరులు ఎడ్లబండ్ల పోటీలను ప్రారంభించారు. వేగంగా పరుగెడుతున్న ఎద్దుల్లో ఒక ఎద్దు కాళ్లు అక్కడి బురదలో ఇరుక్కుపోయి కింద పడి ఊపిరి ఆడక మృత్యువాత పడింది. సాయంత్రం మరో ఎద్దు ఇదేవిధంగా జరిగిన ప్రమాదంలో కొమ్ము విరిగింది.



మృతి చెందిన ఎద్దు

పోటీల పేరుతో మూగజీవాల హింస

ఎడ్లబండ్ల పోటీల్లో ఎలాగైనా గెలవాలని రైతులు మూగజీవాలను కర్రలతో కొడుతూ వాటిని వేగంగా పరిగెత్తేలా చేయడంతో ప్రమాదాల బారిన పడేలా చేశారు. చనిపోయిన ఎద్దును రైతు కుటుంబ సభ్యులు రోదిస్తూ అక్కడికి సమీపంలోనే గుంత తవ్వించి ఖననం చేశారు. మొదటిసారి కావడంతో అనుభవం లేక గ్రామంలో నిర్వాహకులు అసౌకర్యాల నడుమ ఎడ్లబండ్ల పోటీలను చేపట్టడంతోనే ఈ ప్రమాదాలు చోటుచేసుకొన్నాయని పలువురు పోటీదారులు, రైతులు ఆందోళన వ్యక్తం చేశారు. తుది పోటీలను శనివారం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు ప్రకటించారు. ఎస్సై ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు చేపట్టారు.

రాష్ట్రస్థాయి ఫుట్‌బాల్ పోటీలు ప్రారంభం



క్రీడా జ్యోతిని వెలిగిస్తున్న మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసులు



పోటీలో తలపడుతున్న క్రీడాకారులు

హిందూపురం, న్యూస్‌టుడే: క్రీడలను యజ్ఞంగా భావించేవారు అత్యుత్తమ స్థాయికి చేరుకొంటారని మున్సిపల్ కమిషనర్ సంఘం శ్రీనివాసులు అన్నారు. శుక్రవారం స్థానిక ఎంజీఎం క్రీడా మైదానంలో 68వ ఎస్జీఎఫ్ అండర్ 14 రాష్ట్ర స్థాయి బాల, బాలికల ఫుట్‌బాల్ పోటీలను మున్సిపల్ కమిషనర్ ప్రారంభించి మాట్లాడారు. పట్టణంలో రాష్ట్రస్థాయి ఫుట్‌బాల్ పోటీలు జరగటం ఎంతో అభినందనీయమన్నారు. ఈ పోటీలు విద్యార్థులు, క్రీడాకారులకు ఎంతో స్ఫూర్తినిస్తాయన్నారు. ఎమ్మెల్యే బాలకృష్ణ ఆధ్వర్యంలో ఈ పోటీలు కొనసాగుతున్నాయన్నారు. క్రీడాకారులు గెలిచినా, ఓడినా పోటీలను స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. ఈ పోటీలకు రాష్ట్రంలోని 13 జిల్లాల నుంచి 520 మంది క్రీడాకారులు పాల్గొన్నారన్నారు. అంతకు ముందు కమిషనర్ క్రీడా జ్యోతిని వెలిగించి, క్రీడాకారుల నుంచి గౌరవవందనం స్వీకరించారు. ఈ పోటీలు శుక్రవారం నుంచి మూడు రోజులు కొనసాగుతాయన్నారు. ఎంఈవో ఏహెచ్ గంగప్ప, జిల్లా ఫుట్‌బాల్ సంఘం అధ్యక్షుడు జేవీ అనిల్‌కుమార్, కౌన్సిలర్ డీఈ రమేశ్‌కుమార్, హెచ్‌ఎం సామ్రాజ్యం, ఎస్‌జీఎఫ్ ఆర్గనైజింగ్ కార్యదర్శి మురార్జీయాదవ్, ఆర్గనైజింగ్ కార్యదర్శి లోక్‌నాథ్, డీఎస్‌డీవో డైరెక్టర్ సాయికృష్ణ, వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

తొలి రోజు గెలుపొందిన జట్ల వివరాలు

తొలి రోజు జరిగిన పోటీల్లో బాలుర విభాగంలో గుంటూరు, కృష్ణ, నెల్లూరు, చిత్తూరు, కర్నూలు, శ్రీకాకుళం, అనంతపురం జట్లు విజయం సాధించగా శ్రీకాకుళం-ఈస్ట్ గోదావరి జట్ల మధ్య జరిగిన పోటీ డ్రాగా ముగిసింది. బాలికల విభాగంలో చిత్తూరు, వెస్ట్‌గోదావరి, ఈస్ట్‌గోదావరి, కృష్ణ, గుంటూరు జట్లు గెలుపొందాయి.

ఉరేసుకొని యువకుడి ఆత్మహత్య

రొద్దం, న్యూస్‌టుడే : మండలంలోని నారనాగేపల్లిలో ఓ యువకుడు ఉరేసుకొని మృతి చెందినట్లు రొద్దం పోలీసులు శుక్రవారం కేసు నమోదు చేశారు. ఎస్సై నరేంద్ర తెలిపిన వివరాల ప్రకారం.. నారనాగేపల్లి గ్రామానికి చెందిన బాలాజీ (28) రోజు ఇంటి పైకప్పుపై ఉండే గదిలోనే నిద్రిస్తుంటాడు. గురువారం రాత్రి అక్కడికే వెళ్లి పడుకున్నాడు. శుక్రవారం ఉదయం కాలకృత్యాల కోసం తన తల్లి శశికళబాయి వెళ్లగా పైకప్పునకు ఉరేసుకుని కుమారుడు వేలాడుతూ కనిపించాడు. ఆమె వచ్చి భర్త రవిశంకరరావుకు తెలిపింది. ప్రేమ విఫలం కావడంతోనే ఆత్మహత్యకు పాల్పడినట్లు పోలీసులు ప్రాథమికంగా నిర్ధారించారు. మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించామని పోలీసులు తెలిపారు.

హత్య కేసులో నిందితుల అరెస్టు

పెనుకొండ, న్యూస్‌టుడే: రొద్దం మండలం ఎల్‌జీబీ నగర్ శివారులో ఈ నెల 19న హత్యకు గురైన వ్యక్తి కేసులో నిందితులను మూడు రోజుల్లోనే అరెస్టు చేసినట్లు హిందూపురం డీఎస్పీ మహేశ్ తెలిపారు. శుక్రవారం సాయంత్రం పెనుకొండ పోలీస్‌సర్కిల్ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. హత్యకు గురైన వ్యక్తి వద్ద లభించిన పెయింటింగ్ కూపన్ల ద్వారా ఆచూకీ కోసం ప్రయత్నించారు. పెయింటర్స్ వాట్సప్ సమూహంలో మృతుడి వద్ద లభించిన దుస్తులు, చెప్పులు, చేతిదారం, మృతి చిత్రాలను వైరల్ చేయడంతో, మృతుడు పరిగి మండలంలోని శిరేకోళం గ్రామానికి చెందిన కురుబ రమేశ్‌గా, అతని తల్లి వెంకటలక్ష్మమ్మ, అక్క శ్యామలమ్మచేత గుర్తించారు. కొన్నేళ్ల కిందట శిరేకోళం గ్రామానికి చెందిన రమేశ్‌కు, పరిగి మండలంలోని శ్రీరంగరాజుపల్లి గ్రామానికి చెందిన మహిళతో వివాహం జరిపించారు. వీరికి ఇద్దరు కుమారులు. పెయింటింగ్ పనులకు వెళ్లి జీవనం సాగించేవాడు. కొంతకాలంగా రమేశ్ తాగుడుకు బానిసై తరచూ భార్యతో గొడవ పడేవాడు. భార్య రమేశ్‌ను వదిలి శ్రీరంగరాజుపల్లికి వెళ్లిపోయి అక్కడే ఉండి గార్మెంట్స్‌లో పనికి వెళుతుంది. ఆ సమయంలో పక్క గ్రామం కేతేపల్లికి చెందిన చాకలి రాజుతో పరిచయం ఏర్పడి అది వివాహేతర సంబంధంగా మారింది. తరచూ గొడవపడుతున్న భర్త రమేశ్‌ను అడ్డుతొలగించుకోవడానికి, రాజు, అతని మేనమామ సుబ్బరాయప్పతో కలసి ఆమె హత్యకు కుట్రపన్నింది. పథకం ప్రకారం రమేశ్‌ను ఈనెల 19న ఎల్‌జీబీనగర్ సమీపంలో ఈతకల్లు తాగేందుకు సుబ్బరాయప్ప ద్విచక్రవాహనంపై తీసుకొచ్చాడు. చాకలిరాజుతో కలసి రమేశ్‌కు కల్లు తాగించి వెంట తెచ్చుకున్న కత్తితో పొడిచి ద్విచక్రవాహనంలోని పెట్రోల్ పోసి మృతదేహాన్ని గుర్తుపట్టకుండా నిప్పుపెట్టినట్లు దర్యాప్తులో తేలింది. మృతుడి చరవాణి స్విచ్ ఆఫ్ చేసి అక్కడి నుంచి పరారయ్యారు. కేసులో నిందితులైన రాజు, సుబ్బరాయ్యప్ప, మృతుడి భార్యను కోర్టులో హాజరు పరుస్తామన్నారు. సీఐ రాఘవన్, రొద్దం ఎస్సై నరేంద్ర, పరిగి ఎస్సై రంగడు, ఏఎస్సై మరళి, హెడ్‌కానిస్టేబుల్ ఆదినారాయణ, నాగరాజు, మహిళా హెడ్‌కానిస్టేబుల్ రేణుకాదేవి, కానిస్టేబుళ్లు దస్తగిరి, జనార్దన్, దనుంజయ, లక్ష్మీకుమార్, గాయత్రిలను జిల్లా ఎస్పీ రత్న అభినందించారు.



రమేశ్



నిందితులు, జప్తుచేసిన ద్విచక్రవాహనాలు, చరవాణులను చూపుతున్న డీఎస్పీ మహేశ్

వంగపేరులో పడి మహిళ మృతి

కొత్తచెరువు, న్యూస్‌టుడే : కొత్తచెరువు మండలం ఇరగంపల్లికి చెందిన అంకె ఆంజనేయులు భార్య ఈరమ్మ (62) వంగపేరులో జారిపడి మృతి చెందింది. గ్రామస్థులు తెలిపిన మేరకు వివరాలిలా ఉన్నాయి. శుక్రవారం మధ్యాహ్నం ఈరమ్మ దుస్తులు ఉతకడానికి వంగపేరుకు వెళ్లింది. దుస్తులు ఉతుకుతుండగా ప్రమాదవశాత్తూ జారి పడింది. పరిసరాల్లోని వారు గుర్తించేలోపు వంగపేరు ప్రవాహంలో గల్లంతైంది. వెంటనే కుమారుడు అంకె శ్రీనివాసులు గ్రామస్థుల సాయంతో వంగపేరులో గాలించారు. చివరకు సాయంత్రానికి దిగువ చెక్‌డ్యాంలో మృతదేహాన్ని గుర్తించారు. ఆమెకు నలుగురు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. ఆకస్మికంగా తల్లి మృతి చెందడంతో కుటుంబంలో విషాదం నెలకొంది. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని ప్రమాదంపై స్థానికులను విచారించారు. వంగపేరు ప్రవాహ ఉద్ధృతి తగ్గకపోవడంతో పరిసర గ్రామాలకు చెందిన స్థానికులు జాగ్రత్తగా ఉండాలని పోలీసులు హెచ్చరించారు.

హిందూపురం
• హిందూపురం • పెనుకొండ • మడకశిర

ఆంజనేయస్వామి విగ్రహ ఏర్పాటుకు విరాళం

హిందూపురం అర్బన్: సూగూరు ఆంజనేయస్వామి ఆలయ ప్రాంగణంలో నిర్మిస్తున్న అభయ ఆంజనేయస్వామి విగ్రహానికి శుక్రవారం స్థానికంగా ఉన్న ఈడిగ రామయ్య కుమారుడు నరసింహప్ప భార్య ఆదిలక్ష్మి రూ.లక్షను ట్రస్ట్ ఛైర్మన్ వైసీ చంద్రశేఖర్, సభ్యులకు అందజేశారు.

నేడు ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సమావేశం

హిందూపురం, న్యూస్‌టుడే: పట్టణంలోని జిల్లా ప్రభుత్వ ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సమావేశం శనివారం ఉదయం 10 గంటలకు ఉంటుందని సూపరింటెండెంట్ లింగన్న తెలిపారు. సమావేశానికి జిల్లా కలెక్టర్ చేతన్, జిల్లా ఆసుపత్రి కోఆర్డినేటర్, ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యులు హాజరవుతారన్నారు.

ప్రాథమిక పాఠశాలలో కంటివైద్య శిబిరం

గోరంట్ల: స్థానిక రాజీవ్‌కాలనీ ప్రాథమిక పాఠశాలలో పీస్‌వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో శుక్రవారం ఉచిత కంటివైద్య శిబిరం ఏర్పాటుచేసినట్లు ప్రధానోపాధ్యాయురాలు ఉషారాణి తెలిపారు. విద్యార్థులకు చికిత్సలు చేసి అవసరమైన మందులు పంపిణీ చేసినట్లు తెలిపారు.

పాముకాటుతో మహిళ మృతి

గుడిబండ, న్యూస్‌టుడే: గుడిబండ మండలం వీసీగిరిలో శివలింగప్ప భార్య నీలమ్మ(47) పాముకాటుతో శుక్రవారం మృతి చెందింది. నీలమ్మ అగళి మండలం హళ్లీకెర గ్రామంలో పత్తి తీసేందుకు కూలికి వెళ్లింది. మధ్యాహ్నం పాముకాటుకు గురవ్వడంతో వెంటనే రొళ్ల పీహెచ్‌సీకి తీసుకెళ్లారు. వైద్య చికిత్సలు పొందుతూ అక్కడే మృతి చెందింది. మృతురాలికి భర్త, ముగ్గురు కుమారులున్నారు.

ఎడ్లబండ్ల పోటీలు తిలకించి వెళ్తూ వ్యక్తి..

సోమందేపల్లి: వెలగమేకలపల్లి మలుపు సమీపంలో శుక్రవారం జరిగిన ఎడ్లబండ్ల పోటీలను పుట్టపర్తి మండలం నిడిమామిడికి చెందిన రామాంజనేయులు(40) ఉత్సాహంగా తిలకించి వెళ్తూ గోరంట్లలో గుండె పోటుతో మృతి చెందాడు. గోరంట్లలో ఉన్న తన అల్లుడు రాజు ఎద్దులు ఈ పోటీల్లో ఫైనల్‌కు చేరడం.. చీకటి పడటంతో శనివారం రావాలని నిర్వాహకులు చెప్పడంతో బయలుదేరారు. గుండెల్లో నొప్పిగా ఉందని బంధువులకు చెప్పడంతో అక్కడి ఆసుపత్రికి తరలించగా మృతి చెందినట్లు చెప్పారు.

రైలుకింద పడి వ్యక్తి బలవన్మరణం

హిందూపురం, న్యూస్‌టుడే: మడకశిర పట్టణం సమీపంలోని వడ్రపాళ్యంకు చెందిన జేసీ కుమార్(35) శుక్రవారం సాయంత్రం మలగూరు- హిందూపురం మధ్యలో రైలు కింద పడి బలవన్మరణం చెందినట్లు రైల్వే ఎస్సై బాలాజీనాయక్ తెలిపారు. ఇతను ఆన్‌లైన్ మట్కా, ఇతర వ్యసనాల బారిన పడి అప్పులు చేశాడని, ఈ విషయం తెలుసుకొన్న తండ్రి చేసిన అప్పులు కొంత తీర్చినా రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడన్నారు. రాత్రి మృతదేహాన్ని ఘటనా స్థలం నుంచి ప్రభుత్వ ఆసుపత్రిలోని శవపరీక్ష గదికి తరలించినట్లు ఎస్సై వివరించారు.

నేరాల నివారణపై అవగాహన

పెనుకొండ : నేరాల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై శుక్రవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఎస్సై వెంకటేశ్వర్లు మహిళా పోలీసులకు అవగాహన కల్పించారు. పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని పట్టణంలోని ఎంజేపీ పాఠశాలలోని పదోతరగతి విద్యార్థులకు ఓపెన్‌హౌస్ నిర్వహించి స్టేషన్ అడ్మినిస్ట్రేషన్ గురించి వివరించారు. అనంతరం మడకపల్లిలో గ్రామస్థులతో సమావేశం నిర్వహించి పోలీసు వ్యవస్థపై అవగాహన కల్పించారు.

వైభవంగా బోయకొండ గంగమ్మ నగరోత్సవం

పట్టణంలోని సూరప్పకట్టకింద ఉన్న బోయకొండ గంగమ్మ ఆలయంలో శుక్రవారం అమ్మవారికి కుంకుమార్చన, ప్రత్యేక పూజలు చేశారు. సాయంత్రం అందంగా అలంకరించిన పూల రథంలో అమ్మవారి ఉత్సవమూర్తి ఉంచి నగరోత్సవం నిర్వహించారు. –న్యూస్‌టుడే, హిందూపురం అర్బన్


పుష్పాలంకరణలో బోయకొండ గంగమ్మ

అంగన్‌వాడీ భవనాలకు మహర్దశ

● ఆగిన నిర్మాణాలకు నిధుల కేటాయింపు

గోరంట్ల, న్యూస్‌టుడే: చిన్నారులు, కిశోరబాలికలు, గర్భవతులు, బాలింతల సంక్షేమం కోసం కొనసాగుతున్న అంగన్‌వాడీ కేంద్రాలకు అయిదేళ్ల వైకాపా పాలనలో పక్కా గృహాలు వీడి, మహర్దశ వైపు అడుగులు పడనున్నాయి. 2014-19 తెదేపా హయాంలో అంగన్‌వాడీ కేంద్రాల భవన నిర్మాణాలకు నిధులు మంజూరైన పనులు ప్రారంభించారు. అంతలో ఎన్నికలు రావడంతో నిర్మాణాలు అర్ధాంతరంగా ఆగిపోయాయి. అనంతరం అధికారంలోకి వచ్చిన వైకాపా అయిదేళ్లు వాటి గురించి పట్టించుకోలేదు. ప్రస్తుతం వాటిపై ప్రభుత్వం దృష్టి సారించింది. ఆగిన నిర్మాణాలు పూర్తిచేయడంతో పాటు కేంద్రాలకు మరుగుదొడ్లు, నీటివసతి కల్పనకు నిధులు మంజూరు కావడంతో అధికార వర్గాలు ఇప్పటికే ప్రారంభమయ్యాయి. సోమందేపల్లి ప్రాజెక్టు పరిధిలో సోమందేపల్లి, గోరంట్ల, పరిగి మండలాలు ఉన్నాయి. చాలా చోట్ల భవనాలు లేక కిరాయి భవనాల్లో, అద్దె భవనాల్లో కేంద్రాలు కొనసాగుతున్నాయి. ఈ క్రమంలో మూడు మండలాల పరిధిలో 27 కేంద్రాల్లో ఆగిన భవన నిర్మాణ పనులు, 85 కేంద్రాలకు తాగునీటి వసతి, 37 అంగన్‌వాడీ కేంద్రాలకు మరుగుదొడ్ల నిర్మాణాలకు చర్యలు ప్రారంభమయ్యాయి. కొన్నిచోట్ల పనులు ప్రారంభం కాగా మిగిలిన చోట్ల కావాల్సి ఉంది. మండలాల వారీగా వివరాలు ఇలా ఉన్నాయి.


బూదిలివాండ్లపల్లిలో ప్రారంభానికి సిద్ధమైన కేంద్రం

మంజూరు ఇలా..

ఒక్కో అంగన్‌వాడీ కేంద్రానికి నీటివసతి కల్పించడానికి రూ.17వేలు, మరుగుదొడ్ల నిర్మాణాలకు రూ.36వేల చొప్పున మంజూరైనట్లు అధికారులు వివరించారు. ఈపనులు పూర్తయితే అన్ని హంగులతో అంగన్‌వాడీ కేంద్రాలు రూపుదిద్దుకుంటాయని సిబ్బంది ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

ఉపాధి హామీ పథకం అనుసంధానంగా..

మూడు మండలాల పరిధిలో 27 కేంద్రాల్లో ఆగిపోయిన భవన నిర్మాణాలు చేపట్టడానికి చర్యలు ప్రారంభించారు. ఇప్పటికే గోరంట్ల మండలంలోని మలన మద్దు పంచాయతీ బూదిలివాండ్లపల్లిలో గతంలో ఆగిపోయిన భవన నిర్మాణ పనులు పూర్తిచేశారు. ఉపాధిహామీ పథకం అనుసంధానంతో ఒక్కో భవనానికి బిల్లు రూ.1.5 నుంచి రూ.3 లక్షల వరకు నిధులు మంజూరైనట్లు తెలిపారు.


కమ్మలవాండ్లపల్లిలో అంగన్‌వాడీ కేంద్రం

మరుగుదొడ్లు, నీటివసతి కోసం మార్కింగ్ ఇస్తున్నాం

-మోహన్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ, గోరంట్ల

మండలంలోని అంగన్‌వాడీ కేంద్రాలకు నీటివసతి, మరుగుదొడ్ల నిర్మాణాలకు సంబంధించి సంబంధిత ప్రజాప్రతినిధులు, అధికారులతో చర్చిస్తున్నాం. కొన్నచోట్ల మార్కింగ్‌లు ఇచ్చాం.

పనుల వివరాలు

మండలం	భవన నిర్మాణాలు	నీటి వసతి	మరుగుదొడ్లు
గోరంట్ల	06	23	12
సోమందేపల్లి	01	10	0
పరిగి	20	52	25

మేమున్నాం.. మీకు తోడుగా (10 AM to 1 PM)

హిందూపురం: 80085 73018, పెనుకొండ: 91000 20922, మడకశిర: 76759 19016

సమస్య: ఎస్ఆర్‌హట్టిలో వీధి దీపాలు వెలగడం లేదు. **-ఈరన్న**
సమాధానం: రెండు రోజుల్లో ఏర్పాటు చేస్తాం. **- ప్రకాశ్, కార్యదర్శి, గుడిబండ**
సమస్య: మద్దనకుంట ఎస్సీ కాలనీలో పైపులైన్ లీకవుతోంది. **-శివన్న**
సమాధానం: త్వరలో మరమ్మతు చేస్తాం.
- అమరీశ్, కార్యదర్శి, ముతుకూరు. –న్యూస్‌టుడే, గుడిబండ

సమస్య: వీబూదిపల్లిలో మురుగు నీరు రహదారిపైకి వస్తోంది. **-గాయత్రి**
సమాధానం: రెండు రోజుల్లో శుభ్రం చేయిస్తాం. **-మంజునాథ్, సర్పంచి, కోడిపల్లి.**
సమస్య: గోపిందేవరపల్లిలో ట్యాంకు నీరు వృథాగా పోతుంది. **- నాగరాజు**
సమాధానం: మరమ్మత్తులు చేసి నీటి వృథాను అరికడతాం.
- నేత్రావతి, సర్పంచి, శిరివరం. –న్యూస్‌టుడే, లేపాక్షి

సమస్యల పరిష్కారం

స్పందనకు వందనం

లేపాక్షి, న్యూస్‌టుడే: గ్రామాల్లో నెలకొన్న సమస్యలను 'ఈనాడు'లో ప్రచురితమయ్యే 'మేమున్నాం...మీకు తోడుగా' దృష్టికి ప్రజలు తీసుకురావడంతో సంబంధిత బాధ్యులు స్పందించి పరిష్కరించారు. పి.బసవన్నపల్లిలో సర్పంచి అశ్వర్థ నారాయణ ఆధ్వర్యంలో సిబ్బంది నూతనంగా వీధి దీపాలు ఏర్పాటు చేసి గ్రామంలో అంధకారాన్ని తొలగించారు. కర్ణాటక రాష్ట్రం నగరిగెర ప్రధాన రహదారి నుంచి మైదుగోళం వెళ్లే రహదారి కంకరతేలి రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్న విషయాన్ని అధికారుల దృష్టికి తీసుకెళ్లగా రూ.70 లక్షలతో బీటీ రోడ్డు నిర్మాణానికి భూమిపూజ చేసి పనులు ప్రారంభించారు. ఆయా గ్రామాల ప్రజలు 'ఈనాడు'కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

అదనపు గదుల నిర్మాణానికి విరాళం

లేపాక్షి: మైదుగోళం ప్రాథమికోన్నత పాఠశాలలో అదనపు గదుల నిర్మాణానికి శుక్రవారం తెదేపా మండల కన్వీనర్ జయప్ప, మాజీ ఎంపీపీ ఆనంద్‌కుమార్ ఆధ్వర్యంలో భూమిపూజ చేశారు. గదుల కొరతతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్న విషయాన్ని నాయకులు ఎమ్మెల్యే బాలకృష్ణ దృష్టికి తీసుకురావడంతో స్పందించిన ఆయన రూ.30వేలు విరాళాన్ని నాయకుల ద్వారా ఉపాధ్యాయులకు అందించారు. సర్పంచి రామచంద్రారెడ్డి, స్కూల్ కమిటీ ఛైర్మన్ షాజు, నాయకులు మూర్తి, రామాంజి, నాగరాజు పాల్గొన్నారు.

జాతీయ స్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపిక

హిందూపురం : ముద్దిరెడ్డిపల్లి జడ్పీ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్న గోకుల్‌చరణ్‌నాయక్ 68వ రాష్ట్రస్థాయి అండర్ 17 వాలీబాల్ పోటీల్లో ప్రతిభ కనబరచి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల హెచ్‌ఎం సుధామణి, శాప్ ఆర్గనైజింగ్ కార్యదర్శి సురేశ్‌కుమార్ తెలిపారు. నవంబరు 4 నుంచి ఉత్తర్‌ప్రదేశ్ బరేలిలో జరిగే పోటీల్లో పాల్గొంటారన్నారు. ఉపాధ్యాయులు, గ్రామపెద్దలు విద్యార్థిని అభినందించారు.

ప్రతి గడపకు వెళ్లి పశుగణన చేయాలి

హిందూపురం, న్యూస్‌టుడే: ప్రతి గడపకు వెళ్లి పశుగణన చేయాలని పశుసంవర్ధక శాఖ డిప్యూటీ డైరెక్టర్ పెంచలయ్య పేర్కొన్నారు. శుక్రవారం నుంచి ప్రారంభమైన పశుగణన సందర్భంగా స్థానిక ఎమ్మెల్యే కార్యాలయంలో పశుగణన గోడపత్రికలు ఆవిష్కరించి ఎన్యూమరేటర్స్‌కి కిట్లు అందించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ సంఘం శ్రీనివాసులు, ఎమ్మెల్యే వ్యక్తిగత కార్యదర్శి బాలాజీ, డాక్టర్ తిప్పేస్వామి, కౌన్సిలర్ డీఈ రమేశ్‌కుమార్, తెదేపా సీనియర్ నాయకుడు నెట్టప్ప పాల్గొన్నారు. ఈ సందర్భంగా డీడీ మాట్లాడుతూ ఎన్యూమరేటర్లు శుక్రవారం నుంచి ఈనెల 28 వరకు జరిగే అఖిల భారత పశుగణలో భాగస్వాములు కావాలన్నారు. గ్రామం, పట్టణంలోని ప్రతి ఇంటికి వెళ్లి పశువులు, జీవాల వివరాలు సేకరించాలన్నారు. వీటి ఆధారంగా పశుసంవర్ధక శాఖ పథకాలు, మందులు, ఇతర సంక్షేమ పథకాలు అమలు చేస్తారన్నారు.


గోడపత్రాలను విడుదల చేస్తున్న మున్సిపల్ కమిషనర్ సంఘం శ్రీనివాసులు, పశుసంవర్ధక శాఖ డీడీ పెంచలయ్య

ఉపాధి కల్పనకే మెగా ఉద్యోగ మేళా

మడకశిర : నిరుద్యోగ యువతకు ఉద్యోగాలు కల్పించాలనే లక్ష్యంతోనే ఏపీ స్కిల్ డెవలప్‌మెంట్ ఆధ్వర్యంలో జాబ్ మేళా నిర్వహించినట్లు ప్రిన్సిపల్ ఆర్.హేమలత తెలిపారు. పట్టణంలోని ఎస్వైటీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శుక్రవారం నిరుద్యోగ యువతకు జాబ్ మేళా నిర్వహించారు. ఇందులో భాగంగా 8 కంపెనీల ప్రతినిధులు వివిధ గ్రామాల నుంచి వచ్చిన 223మంది నిరుద్యోగ అభ్యర్థులకు ముఖాముఖి నిర్వహించారు. అందులో 108 మంది ఎంపికయ్యారు. వారికి మంచి వేతనంతో పాటు శిక్షణ కల్పిస్తామని పేర్కొన్నారు. వైస్‌ప్రిన్సిపల్ నాగరాజు, జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి బి.హరికృష్ణ, వి.చంద్రశేఖర్, తేజ్‌కుమార్, సాయిగణేష్, సీడాప్ జేసీఓలు ఆంజనేయులు, లక్ష్మి, కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.


ముఖాముఖికి హాజరైన నిరుద్యోగ అభ్యర్థులు

ప్రభుత్వాసుపత్రిలో రక్త పరీక్షలు

మడకశిర : మడకశిరలోని ప్రాంతీయ వైద్యశాలలో అన్ని రకాల రక్త పరీక్షలు నిర్వహించేందుకు కొత్త యంత్రం ఏర్పాటు చేసినట్లు రీజినల్ మెడికల్ ఆఫీసర్ దివాకర్ తెలిపారు. రూ.18లక్షలు విలువ చేసే ఫుల్ ఆటోమెటిక్ యంత్రం ఆసుపత్రిలో అమర్చడం జరిగిందన్నారు. ఈ యంత్రంలో లివర్, కిడ్నీ, హెచ్‌బీ, ప్లేట్‌లెట్ తదితర 50 రకాల రక్తపరీక్షలు ఒకేసారి చేయవచ్చన్నారు.

విద్యార్థులకు వక్తృత్వ పోటీలు

పరిగి, న్యూస్‌టుడే: 'సైబర్ నేరాల.. నియంత్రణలో యువత పాత్ర' అనే అంశంపై శుక్రవారం స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఎస్సై రంగడుయాదవ్ ఆధ్వర్యంలో విద్యార్థులకు వక్తృత్వ పోటీలను నిర్వహించారు. విజేతలకు బహుమతులను ప్రదానం చేయనున్నట్లు ఎస్సై తెలిపారు. ప్రధానోపాధ్యాయుడు కృపాసత్యరాజ్, ఉపాధ్యాయులు, పోలీసులు పాల్గొన్నారు.





ప్రతిభా పాటవం.. విజ్ఞాన వికాసం

హిందూపురంలోని పాంచజన్య బ్రిలియంట్ పాఠశాలలో శుక్రవారం 'ఈనాడు' ఆధ్వర్యంలో 'అతర్జాలం వినియోగంలో లాభనష్టాలు, విద్యార్థులపై సామాజిక మాధ్యమాల ప్రభావం' అనే అంశంపై ప్రతిభా పోటీలు నిర్వహించారు. పోటీల్లో అధిక మంది విద్యార్థులు పాల్గొన్నారు. 10వ తరగతి విద్యార్థులు అల్ఫాఖానమ్ ప్రథమ, పీఎస్ లక్ష్మీనారాయణ ద్వితీయ, 9వ తరగతి చదువుతున్న జీఎల్‌కే వందన తృతీయ స్థానంలో నిలిచారు. పాఠశాల అధ్యక్షులు పి.ఎస్.శ్రీనివాసులు, ప్రధానోపాధ్యాయురాలు జె.ఎన్.గాయిత్రి, కరస్పాండెంట్ నందకుమార్ బహుమతులు అందజేశారు. **-న్యూస్‌టుడే, హిందూపురం**

నాడు కూలీలు.. నేడు మగ్గాల యజమానులు

● ఆర్థికాభివృద్ధిలో ముద్దిరెడ్డిపల్లి శిర్డీసాయి మహిళా సంఘం

హిందూపురం, న్యూస్‌టుడే: కూలీలుగా బతుకుబండి సాగిస్తున్న మహిళల్లో సంఘం వెలుగులు నింపింది. హిందూపురం పట్టణం ముద్దిరెడ్డిపల్లికి చెందిన రాధాకృష్ణ స్లమ్ సమాఖ్యలో ఉన్న షిర్డిసాయి మహిళా సభ్యులు 2006, మే, 10వ తేదీన సంఘంగా ఏర్పాటయ్యారు. నాటి నుంచి పొదుపు బాట పట్టిన వీరు సంఘంలో దాదాపు పది దఫాలు బ్యాంకుల్లో మెప్మా సహకారంతో రుణసౌకర్యం పొందారు. ప్రస్తుతం వీరు రూ.20 లక్షలు స్థానిక కెనరా బ్యాంకు నుంచి రుణం పొంది సంఘంలో ఉన్న సభ్యులందరూ సొంతంగా మరమగ్గాలు ఏర్పాటుచేసుకొని కుటుంబ సభ్యులతో కలసి రోజులు ఒక్కొక్కరు పది చీరలు నేస్తున్నారు. రోజురోజుకు వీరి వ్యాపారం లాభాలబాట పట్టడంతో దాదాపు ఒక్కొక్క మహిళ 2 నుంచి 5 మరమగ్గాలు ఏర్పాటు చేసుకొన్నారు. కుటుంబాలను ఆర్థిక బాట పట్టించటమే కాకుండా తమ పిల్లలను ఉన్నత చదువులు చదివిస్తున్నారు. ఇప్పటి వరకు ఒక్కొక్కరు రూ.30వేలు పొదుపు చేసుకొన్నారు, దీంతో మొత్తం సంఘంలో రూ.3.10లక్షలు పొదుపు, సంఘం నిధి రూ.9.50లక్షలు ఉంది.


సంఘం సభ్యుల సమావేశం

చిన్న అవసరాలకు అప్పులు

మహిళలు సంఘంగా ఏర్పాటు కాకముందు ఏ చిన్న అవసం వచ్చినా అప్పులు చేసేవారు. ప్రస్తుతం వ్యాపారంలో లాభాలు అందుతుండటంతో కుటుంబ అవసరాలకు సరిపడే డబ్బు లభిస్తోంది. దీంతో వీరు ఏ అవసరం పడిన ఇతరుల వద్దకు వెళ్లకుండా జీవనం సాగిస్తున్నామని సంతోషం వ్యక్తం చేస్తున్నారు. గతంలో పాడుబడిన ఇళ్లల్లో ఉన్న సభ్యులు ప్రస్తుతం నూతనంగా నిర్మించుకొన్న ఇళ్లల్లో జీవనం సాగిస్తున్నారు. తమకు ఎమ్మెల్యే బాలకృష్ణ, పురపాలక సంఘం కమిషనర్ సంఘం శ్రీనివాసులు, మెప్మా అధికారులు అవసరమైన సహకారం అందిస్తున్నారని సంఘం సభ్యులు తెలిపారు.

సంఘం లేకుంటే కూలీలుగానే బతికే వాళ్లం

- బి.గంగరత్నమ్మ, షిర్డిసాయి మహిళా సంఘం అధ్యక్షులు, ముద్దిరెడ్డిపల్లి



సమీపంలో నివాసం ఉన్న మహిళలం సంఘంగా ఏర్పాటై పొదుపు పాటించాం. ప్రభుత్వం సహకారంతో బ్యాంకులో రుణాలు తీసుకొని ఇంత స్థాయికి చేరుకొన్నాం. ఇతరులతో సమానంగా జీవనం సాగిస్తున్నాం. ఇది చాలా సంతోషం కలిగిస్తోంది. సంఘం ఏర్పాటు కాకపోయి ఉంటే ఇప్పటికీ తాము కూలీలుగా బతికేవారం. భవిష్యత్తులో మరింత ఉన్నత స్థాయికి చేరి వ్యాపార కార్యకలాపాలు కొనసాగించాలని ఉంది.

ద్విచక్ర వాహనాలు ఢీ.. ఇద్దరికి గాయాలు

గోరంట్ల, న్యూస్‌టుడే: గంగంపల్లి పంచాయతీ గోపిదేవరపల్లి సమీపంలో శుక్రవారం రెండు ద్విచక్రవాహనాలు ఢీ కొన్న ఘటనలో ఇద్దరు గాయపడ్డారు. ముత్తరాయనితండాకు చెందిన రామకృష్ణానాయక్‌కు బలమైన గాయాలు కావడంతో స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్సలు అందించి 108 వాహనంలో హిందూపురం పంపించారు. గంగంపల్లికి చెందిన జయచంద్రకు పుట్టపర్తి ఆసుపత్రిలో చికిత్సలు అందిస్తున్నట్లు తెలిపారు.

టమాటా లారీ బోల్తా

సోమందేపల్లి, న్యూస్‌టుడే: వెలగమేకలపల్లి మలుపులో జాతీయ రహదారి పక్కన గురువారం అర్ధరాత్రి అదుపుతప్పి టమాటా లారీ బోల్తా పడింది. చోదకుడు ప్రమాదం నుంచి క్షేమంగా బయటపడ్డారు. టమాటా బాక్సులను కర్ణాటకలోని కోలార్ నుంచి హైదరాబాద్‌కు తీసికెళ్తూ ఈ ప్రమాదం జరిగింది.

బరదమయం.. నరక ప్రయాణం

మండలంలోని పీఎన్‌పాళ్యం, వడ్రహట్టి మధ్య ఉన్న మట్టి రోడ్డు రాకపోకలకు తీవ్ర ఇబ్బందిగా మారింది. చిన్నపాటి వర్షం కురిసినా గుంతల్లో నీరు నిల్వ ఉంటూ అసౌకర్యంగా ఉందని వాహన చోదకులు, పాదచారులు వాపోతున్నారు. ఇప్పటికైనా బీటీరోడ్డు వేయాలని స్థానికులు కోరుతున్నారు. ఈ విషయమై ఎంపీడీఓ గంగాధర్‌ను వివరణ కోరగా బీటీరోడ్డుకు ప్రతిపాదనలు పంపామని, మంజూరైన వెంటనే పనులు చేపడుతామన్నారు. – న్యూస్‌టుడే, గుడిబండ



గుంత.. జర జాగ్రత్త



పట్టణంలోని టీచర్స్ కాలనీలోని మున్సిపల్ పార్క్ పక్కన ఉన్న పెద్ద నీటి ట్యాంకు వద్ద రహదారిలో గుంత ప్రమాదకరంగా మారింది. ఆ గుంతలోని గేట్‌వాల్వు ద్వారా నిత్యం కాలనీలకు నీటిని సరఫరా చేస్తున్నారు. దానిపై మూత వేయడం మరిచారు. దీంతో రాత్రిళ్లు వాహనదారులు ఏమాత్రం అజాగ్రత్తగా ఉన్నా ప్రమాదం తప్పదు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి గుంతకు మూత వేయాలని కాలనీవాసులు కోరుతున్నారు. ఈ విషయమై కమిషనర్ శ్రీనివాసులును వివరణ కోరగా పరిశీలించి చర్యలు తీసుకుంటామన్నారు.
– న్యూస్‌టుడే, హిందూపురం అర్బన్

ట్యాంకు చుట్టూ అపరిశుభ్రత

బీమరాయునిపల్లి తాగునీటి ట్యాంకు చుట్టూ పిచ్చిమొక్కలు పెరిగి అపరిశుభ్రత నెలకొంది. కుళాయిలకు మూతలు బిగించకపోవడంతో నీరు లీకవుతూ చుట్టూ పాచి పట్టింది. ఆరేడు నెలలుగా ట్యాంకు శుభ్రపరచకపోవడంతో నీటిని ఎవరూ పట్టుకోవడం లేదు. ఈ విషయమై పంచాయతీ కార్యదర్శి వేణుగోపాల్ మాట్లాడుతూ హరితరాయబారుల ద్వారా ట్యాంకును, చుట్టూ శుభ్రం చేయిస్తామని తెలిపారు.
– న్యూస్‌టుడే, మడకశిర గ్రామీణం



న్యాయం కోసం భర్త ఇంటి ఎదుట నిరసన

పెనుకొండ, న్యూస్‌టుడే: తన భర్తతో కలవనివ్వడం లేదని ఓ భార్య నిరసనకు దిగిన ఘటన పెనుకొండ మండలంలోని అడదాకులపల్లిలో శుక్రవారం చోటుచేసుకుంది. బాధితుల కథనం మేరకు.. గోరంట్లకు చెందిన మీనాక్షి పెనుకొండ మండలంలోని అడదాకుపల్లికి చెందిన వరసకు బావ అయ్యే అనిల్‌కుమార్ ప్రేమించుకున్నారు. ఈ ఏడాది జూన్‌లో ప్రేమ వివాహం చేసుకున్నారు. తరువాత పెద్దలు ఒప్పుకొని జూన్ 2న కదిరి లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో మరోసారి వివాహం జరిపించారు. ఆషాడమాసం రావడంతో మీనాక్షి పుట్టింటికి వెళ్లింది. శ్రావణమాసంలో అత్తగారింటికి వచ్చింది. భర్త అనిల్‌కుమార్ బెంగళూరులో ఉపాధికోసం వెళ్లాడు. ఈక్రమంలో అత్తామామలు, ఆడపడచు మీనాక్షిపై గొడవపడి పుట్టింటికి పంపేశారు. అనిల్‌కుమార్‌ను మీనాక్షితో కలవకుండా చేశారు. బాధితురాలు 3 నెలల కిందట జిల్లా ఎస్పీ కార్యాలయంలోని స్పందనలో ఫిర్యాదు చేశారు. అయినా న్యాయం జరగక పోవడంతో శుక్రవారం భర్త ఇంటి ముందు బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. తనకు న్యాయం చేయాలని మీనాక్షి కోరుతున్నారు. ఈ ఘటనపై పెనుకొండ ఎస్సై వెంకటేశ్వర్లును వివరణ కోరగా తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదన్నారు.


తల్లిదండ్రులు, బంధువులతో కలిసి బైఠాయించిన మీనాక్షి

మట్టి రోడ్లు.. కాలనీల్లో కష్టాలు

హిందూపురం గ్రామీణం, న్యూస్‌టుడే: హిందూపురం పురపాలక సంఘం పరిధిలో ముద్దిరెడ్డిపల్లి ప్రాంతం అత్యంత పెద్దది. కొత్తూరులో ఏర్పడిన సుభాష్‌నగర్, పిరమిడ్‌నగర్, అరవిందనగర్, శివబాలయోగినగర్‌లలో పదేళ్ల కిందట వేసిన సిమెంటు రోడ్లే తప్ప తరువాత కొత్తగా వేసిందే లేదు. కాలనీల్లో ప్రజలు స్వయంగా ఏర్పాటు చేసుకున్న మట్టి రోడ్లే శరణ్యం. ఈ నాలుగు కాలనీల్లో పది చోట్ల మట్టి రోడ్లే ఉండడం, వర్షం వస్తే చాలు బురదమయం అవుతున్నాయి. ఈ కారణంగా పాదచారులే కాదు.. వాహనదారుల రాకపోకలకు కష్టంగా ఉందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సిమెంటు రోడ్లు నిర్మించాలని పలుమార్లు అధికారులకు, మున్సిపల్ కౌన్సిల్ సభ్యులకు విన్నవించుకున్నా ఎవరూ పట్టించుకోలేదని వాపోయారు.


ముద్దిరెడ్డిపల్లి కొత్తూరులో తాత్కాలిక మట్టి రోడ్డు

చర్యలు తీసుకుంటాం

-సంగం శ్రీనివాసులు, మున్సిపల్ కమిషనర్

పట్టణంలో సిమెంటు రోడ్ల నిర్మాణ విషయమై వార్డుల్లో సర్వే చేస్తున్నాం. నిధుల కోసం ప్రతిపాదనలు తయారు చేస్తున్నాం. మంజూరైతే ముద్దిరెడ్డిపల్లి సిమెంటు రోడ్ల నిర్మాణానికి చర్యలు తీసుకుంటాం.

పురపాలక సంఘం: హిందూపురం	ప్రాంతం: ముద్దిరెడ్డిపల్లి	కాలనీలు: నాలుగు	నివాసగృహాలు: 1,120	జనాభా: 4,596

క్రీడలతో మానసిక ఉల్లాసం

సోమందేపల్లి, న్యూస్‌టుడే: ప్రస్తుత పరిస్థితుల్లో క్రీడా పోటీలు యువత, విద్యార్థులకు ఎంతో దోహద పడతాయని తెదేపా హిందూపురం పార్లమెంట్ నియోజకవర్గం కార్యదర్శి చంద్రశేఖర్, తొగటవీర క్షత్రియ సంఘం అధ్యక్షుడు సీసీ హరి అన్నారు. ఈనెల 5వ తేదీనుంచి స్థానిక స్నేహలతా నగర్ వద్దగల రైతు పొలంలో ప్రారంభమైన మెగా క్రికెట్ పోటీలు శుక్రవారంతో ముగిశాయి. విజేతగా సోమందేపల్లి ఎలెవెన్స్ జట్టు నిలిచింది. గెలుపొందిన జట్టు క్రీడాకారులకు చంద్రశేఖర్, సీసీ హరి, తెదేపా నాయకుడు సూరి, షాషావలి తదితరులు జ్ఞాపికతో పాటు రూ.30 వేలు నగదు, రన్నర్స్ జట్టుకు జ్ఞాపిక, రూ.20 వేల నగదును అందజేశారు. నిర్వాహకుడు, జనసేన మండల అధ్యక్షుడు జబీవుల్లా, బాబా, మద్దిలేటి, ఆనంద్ తదితరులకు పాల్గొన్నారు.


గెలుపొందిన జట్టుకు జ్ఞాపిక, నగదు అందజేస్తున్న నాయకులు

మరవకట్ట మరమ్మతులు పూర్తి

పరిగి: జయమంగళి వరద నీరు పరిగి చెరువుకు చేరుతున్న నేపథ్యంలో బీసీ సంక్షేమశాఖ మంత్రి సవిత ఆదేశం మేరకు ఇరిగేషన్ శాఖ ఆధ్వర్యంలో స్థానిక తెదేపా నాయకులు మరవ కట్ట అభివృద్ధి పనులను పూర్తి చేశారు. ముళ్ల కంపను పొక్లెయిన్ సాయంతో తొలగించారు. మరవకు పలకలు ఏర్పాటు చేశారు. మరవ సమీపంలో ఏర్పడిన గోతులను లక్షలాది రూపాయలు వెచ్చించి మరమ్మతు పనులు పూర్తి చేశారు. స్థానిక తెదేపా నాయకులు లక్ష్మణరావు, బలరాం, శ్రీనివాసులు పంచాయతీ కార్యదర్శి నారాయణ పాల్గొన్నారు.

'జాతీయ నాయకుల విగ్రహాలు ఏర్పాటు చేయాలి'

రొళ్ల: రొళ్లలో స్వాతంత్ర్య సమరయోధులు, జాతీయ నాయకుల విగ్రహాలు ఏర్పాటు చేయాలని లోక్‌కల్యాణ్ ప్రజాసాక్షి సమితి సభ్యులు కోరారు. పాఠశాలల విద్యార్థులు, వివిధ జాతీయ నాయకుల వేషధారణతో ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఉపతహసీల్దార్ భాగ్యలక్ష్మికి వినతి పత్రం అందించారు. సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సుబ్బారాయుడు, ఉమేష్ తదితరులు పాల్గొన్నారు.


జాతీయ నాయకుల వేషధారణలతో ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

పుట్టపర్తి

•పుట్టపర్తి •ధర్మవరం •కదిరి •రాప్తాడు

'మద్యం దుకాణాలు తెరవకపోతే లైసెన్స్ రద్దు చేస్తాం'

పుట్టపర్తి పట్టణం: లాటరీలో మద్యం దుకాణాలు దక్కిన వారు తప్పకుండా వాటిని నిర్వహించాలని, అలా నిర్వహించని పక్షంలో వారి లైసెన్స్ రద్దు చేస్తామని శుక్రవారం ఎక్సైజ్ సూపరింటెండెంట్ ఎస్.గోవిందనాయక్ తెలిపారు. జిల్లాలో 87 మద్యం దుకాణాలు నిర్వహించడానికి ప్రభుత్వం లైసెన్స్ మంజూరు చేసిందని, అందులో 81 మాత్రమే నిర్వహిస్తున్నారన్నారు. మిగిలిన ఆరుగురు ఇప్పటి వరకూ దుకాణాలు నిర్వహించలేదని, దీని వల్ల ప్రభుత్వ ఆదాయానికి నష్టం చేకూరుతుందన్నారు. వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ప్రభుత్వం తెలిపిన నిర్ణీత సమయం లోపు దుకాణాలు తెరవకపోతే అలాంటి వారి లైసెన్సులు రద్దు చేసి, తిరిగి వాటికి లాటరీ నిర్వహించడానికి ప్రభుత్వానికి అధికారముందన్నారు. మద్యం దుకాణాల నిర్వాహకులు ఒక వ్యక్తికి 3 మద్యం సీసాలు మాత్రమే విక్రయించాలని స్పష్టం చేశారు. గొలుసు దుకాణాల నిర్వాహకులపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

28న మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికుల సమస్యలపై ఆందోళన

ధర్మవరం పట్టణం: మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికులకు స్కిల్, సెమీ స్కిల్ ఆధారంగా వేతనాలివ్వాలని సుప్రీం కోర్టు ఉత్తర్వులు జారీ చేసినా రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయకుండా నిర్లక్ష్యం చేస్తోందని సీపీఐ మండల అధ్యక్షుడు జేవీ రమణ ఆరోపించారు. శుక్రవారం స్థానిక సీఐటీయూ కార్యాలయంలో మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికుల సంఘం సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత వైకాపా ప్రభుత్వ హయాంలో కార్మికుల సమస్యల పరిష్కారానికి 16 రోజుల పాటు సమ్మె చేసినా పట్టించుకోలేదని విమర్శించారు. కూటమి ప్రభుత్వం స్పందించి ఇచ్చిన హామీలను పరిష్కరించాలని కోరారు. మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఈ నెల 28న మున్సిపల్ కార్యాలయం ఎదుట ఆందోళన చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్మిక సంఘం నాయకులు నాగరాజు, అనిల్, మహేష్, పెద్దన్న, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

క్రియాశీలకంగా సభ్యత్వ నమోదు చేపట్టండి



పార్టీ శ్రేణులకు సూచనలిస్తున్న ఎమ్మెల్యే పరిటాల సునీత

చెన్నేకొత్తపల్లి : తెదేపా సభ్యత్వ ప్రక్రియను క్రియాశీలకంగా చేపట్టాలని ఎమ్మెల్యే పరిటాల సునీత పార్టీ శ్రేణులతో పేర్కొన్నారు. మండల కేంద్రంలోని తెదేపా కార్యాలయంలో శుక్రవారం సభ్యత్వ నమోదుపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ తెదేపా సభ్యత్వం తీసుకోవడం వల్ల కలిగే మేలును ప్రజలకు వివరించి సభ్యత్వం తీసుకునేలా కృషి చేయాలన్నారు. సభ్యత్వం తీసుకున్నవారు ప్రమాదవశాత్తు మరణిస్తే రూ. 5 లక్షల సొమ్ము అందుతుందన్నారు. దీపావళి నుంచి ఉచిత గ్యాస్ సిలెండర్లు, జనవరి నుంచి కొత్త పింఛన్లు, త్వరలోనే నూతన రేషన్ కార్డుల జారీ కార్యక్రమం ఉంటుందన్నారు. తెదేపా మండల కన్వీనర్ ముత్యాలరెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు ఓబిలేశు, మాజీ ఎంపీపీ అమరేంద్ర పాల్గొన్నారు.

క్రీడల్లో ప్రతిభా తేజాలు

క్రికెట్, వాలీబాల్‌లో రాణిస్తున్న విద్యార్థులు



సాధన చేస్తున్న తేజశ్విని

కదిరి, న్యూస్‌టుడే : కదిరికి చెందిన తేజశ్విని క్రికెట్, భానుతేజ వాలీబాల్ సత్తాచాటుతున్నారు. తమదైన క్రీడా ప్రతిభ ప్రదర్శనతో ఆకట్టుకుంటున్నారు. జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయిల్లోనూ పోటీలకు స్థానం దక్కించుకుంటున్నారు. ప్రస్తుతం క్రికెట్‌లో ఒకరు రాష్ట్ర ప్రాబబుల్స్‌ను ఆడుతుండగా, మరొకరు వాలీబాల్ జాతీయ స్థాయి పోటీలకు స్థానం దక్కించుకున్నారు. నిరంతర సాధనతో ఆటపై పట్టు సాధించి, మెరుగైన ఆటతీరుతో రాణించి ప్రత్యేక స్థానంతో గుర్తింపు పొందాలన్నది లక్ష్యంతో ముందుకెళ్తున్న క్రీడాకారులను చెబుతున్నారు.

భారత్ తరఫున ఆడాలని..

కదిరికి చెందిన తేజశ్విని సాధన పాఠశాలలో 8వ తరగతి చదువుతోంది. వేసవి శిక్షణ శిబిరంతో క్రికెట్‌పై ఆసక్తిని పెంచుకుంది. జిల్లా క్రికెట్ సంఘం నిర్వహిస్తున్న కదిరి సబ్ సెంటర్‌లో ఏడీసీఏ కోచ్ నజీర్ వద్ద శిక్షణ పొందుతోంది. 2021-22, 2022-23లో జరిగిన అండర్-12 మిక్స్‌డ్ జెండర్ పోటీల్లో బాలిక పాల్గొన్న జట్టు రెండుసార్లు కప్ కైవసం చేసుకుంది. 2022-23, 24లో నిర్వహించిన స్కూల్ గేమ్స్‌లో అండర్-17 విభాగంలో రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొన్న మెరుగైన ఆట ప్రదర్శించింది. ఈ ఏడాది అండర్-15 విభాగంలో సౌత్‌జోన్ మ్యాచ్‌లో అత్యధిక వికెట్లు సాధించి రాష్ట్ర ప్రాబబుల్స్‌కు ఎంపికైంది. అక్కడ కూడా తనదైన ఆటతీరును కనబరిచింది. అంతర్జాతీయ మహిళా క్రికెట్ జట్టులో స్థానం పొందాలన్న లక్ష్యంతో ముందుకెళ్తోంది.

జాతీయ జట్టుకు ప్రాతినిధ్యం వహించాలని..



కరస్పాండెంట్ అనిల్‌కుమార్‌రెడ్డితో భానుతేజ

కదిరిలోని సామాన్య కుటుంబానికి చెందిన భాను తేజ వాల్మీకి పాఠశాలలో పదో తరగతి చదువుతున్నాడు. ఆరో తరగతి నుంచే వాలీబాల్ క్రీడపై మక్కువ పెంచుకున్నాడు. ఎప్పటికైనా జాతీయ జట్టులో ఆటగాడిగా దేశం తరఫున ఆడాలనే పట్టుదలతో ఉన్నాడు. దీంతో తరగతి గదిలో పాఠాలతో సమానంగా ఆటపై దృష్టి సారించాడు. గడచిన నాలుగేళ్లలో జిల్లా, రాష్ట్ర స్థాయిలో జరిగిన పలు పోటీల్లో ఉత్తమ ప్రదర్శనతో ఆకట్టుకున్నాడు. 2023లో మధ్యప్రదేశ్‌లో జరిగిన జాతీయస్థాయి పోటీల్లో మెరుగైన ప్రతిభ ప్రదర్శించి.. జట్టును తృతీయ స్థానంలో నిలిపి కాంస్య పతకం అందుకున్నాడు. ఇటీవల జరిగిన రాష్ట్ర స్థాయి పోటీల్లో రాణించి జాతీయ పోటీలకు ఎంపికయ్యాడు. నవంబరు 6 నుంచి 10 వరకు ఉత్తరప్రదేశ్‌లో జరిగే పోటీల్లో పాల్గొననున్నాడు. క్రీడల్లో రాణించేందుకు పాఠశాల యాజమాన్యం అనిల్‌కుమార్‌రెడ్డి, పవన్‌కుమార్‌రెడ్డిల ప్రోత్సాహాన్ని అందిస్తున్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా (10 AM to 1 PM)

పుట్టపర్తి: 80085 73039, కదిరి: 80085 73033, ధర్మవరం: 99596 98222

సమస్య : కృష్ణాపురం క్రాస్ నుంచి కృష్ణాపురం గ్రామానికి వెళ్లే ఆర్అండ్‌బీ రోడ్డు అధ్వానంగా మారింది. నల్లచెర్లోపల్లి దగ్గర రోడ్డు గుంతలుపడడంతో రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. **- మోహన్, కృష్ణాపురం**

సమాధానం : నిధులు మంజూరైన వెంటనే రోడ్డు నిర్మాణం చేపడతాం. **- వన్నూరుస్వామి, ఆర్అండ్‌బీ ఇన్‌ఛార్జి ఏఈ.**

సమస్య : ముదిగుబ్బ పాతూరులో నిత్యం విద్యుత్తు అంతరాయం చోటుచేసుకుంటోంది. రోజూ నాలుగైదు గంటల సమయం విద్యుత్తు కోతలకు విధిస్తుండటంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. **- రెడ్డినారాయణప్ప, పాతూరు**

సమాధానం : విద్యుత్తు అంతరాయం లేకుండా చర్యలు తీసుకుంటాం.

సమస్య : ముదిగుబ్బలోని ఆంధ్రాబ్యాంకు వెనుక వీధిలో నిత్యం అధిక లోడుతో విద్యుత్తు అంతరాయం చోటుచేసుకుంటోంది. అధికలోడు నియంత్రిక ఏర్పాటు చేస్తే సమస్య తీరుతుంది. **- గ్రామస్థులు**

పరిష్కారం : సమస్యను విద్యుత్తు శాఖ ఏడీఈ ఉదయ్‌కుమార్ దృష్టికి తీసుకెళ్లగా 160 హెచ్‌పీ సామర్థ్యం కలిగిన నియంత్రిక ఏర్పాటు చేయించారు.

(పై రెండు సమస్యలకు కదిరి విద్యుత్తుశాఖ ఏడీఈ ఉదయ్‌కుమార్ సమాధానమిచ్చారు.) – న్యూస్‌టుడే, ముదిగుబ్బ

29న జిల్లా జట్ల ఎంపిక పోటీలు

కదిరి, న్యూస్‌టుడే : ఈనెల 29న హ్యాండ్ బాల్ సీనియర్ ఉమెన్స్ జిల్లా జట్టు ఎంపిక చేస్తున్నట్లు జిల్లా హ్యాండ్‌బాల్ అసోసియేషన్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు విజయకుమార్, మహేశ్‌లు ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపిక పోటీలు కదిరి ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో ఉదయం 10 గంటలకు ప్రారంభమవుతాయన్నారు. ఆసక్తి కలిగిన క్రీడాకారిణులు తమ ఆధార్‌కార్డు వెంట తీసుకుని రావాలన్నారు.

బుక్కపట్నం : ఉమ్మడి అనంతపురం జిల్లా షూటింగ్ బాల్ జిల్లా జట్టు ఎంపిక పోటీలు ఈ నెల 29న నిర్వహిస్తున్నట్లు షూటింగ్‌బాల్ అసోసియేషన్ కార్యదర్శి మనోహర్‌రెడ్డి తెలిపారు. సబ్ జూనియర్స్ అండర్-17 విభాగంలో రాష్ట్ర స్థాయి పోటీలకు జిల్లా జట్టు ఎంపిక పోటీలు బుక్కపట్నం బాలుర ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో జరుగుతాయని, క్రీడాకారులు ఈ విషయం గుర్తించి పోటీలకు హాజరు కావాలని కోరారు.

ఎస్‌ఐ బాధ్యతల స్వీకరణ

తాడిమర్రి, న్యూస్‌టుడే : మండల నూతన ఎస్‌ఐగా కృష్ణవేణి శుక్రవారం తాడిమర్రి పోలీసు స్టేషన్‌లో బాధ్యతలు స్వీకరించారు. ఆమె గాండ్లపెంట నుంచి బదిలీపై ఇక్కడికి వచ్చారు. ఇక్కడ పని చేస్తున్న ఎస్‌ఐ నాగస్వామి వీఆర్‌కు బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా పలువురు తెదేపా నాయకులు నూతన ఎస్‌ఐను కలిసి అభినందనలు తెలిపి పుష్పగుచ్ఛం అందజేశారు.

తెదేపా బ్యానర్ల చించివేతపై ఫిర్యాదు

గాండ్లపెంట : గాండ్లపెంటలో ప్రధాన రహదారి పక్కన, జీనులకుంట రోడ్డులో ఏర్పాటు చేసిన ఎమ్మెల్యే కందికుంట, నాయకుల బ్యానర్లను గుర్తుతెలియని వ్యక్తులు గురువారం అర్ధరాత్రి కత్తిరించినట్లు తెదేపా మండల కన్వీనర్ కొండయ్య, నాయకులు అక్రంబాషా, లక్ష్మీనరసారెడ్డి, లోకేశ్ తదితరులు ఏఎస్‌ఐ రంగనాయక్‌కు ఫిర్యాదు చేశారు. తెదేపా బ్యానర్లను ఉద్దేశపూర్వకంగానే చించి వేశారని ఆరోపించారు. వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. ఘటనా స్థలాన్ని ఎస్‌ఐ వలిబాషా పరిశీలించారు. అనంతరం వివరాలను సీఐకు సమాచారం ఇచ్చారు.

ఆక్రమణ పొలంలో బోర్డు ఏర్పాటు

తలుపుల : తలుపుల పంచాయతీ కొరుగుట్టపల్లి సమీపంలో ఓ ప్రైవేటు వైద్యుడు సర్వే నం: 885 లోని 1.44 ఎకరాల వంక పొరంబోకు భూమిని ఆక్రమించి మామిడి చెట్లు సాగు చేశారు. దీంతో పొలాలకు వెళ్లేందుకు రైతులకు దారి లేకుండా పోయింది. దీనిపై రైతులు చేసిన ఫిర్యాదు మేరకు ఇరిగేషన్‌శాఖ అధికారులు స్పందించి, రెవెన్యూ అధికారులతో కొలతలు వేయించారు. ఆ కొలతల మేరకు సంబంధిత వంక పొరంబోకు స్థలంలోకి ఎవరూ వెళ్లకుండా బోర్డును పాతినట్లు శుక్రవారం వీఆర్‌ఓ ముంతాజ్ చెప్పారు.

సీపీఎం మండల కమిటీ ఎన్నిక

తనకల్లు : తనకల్లులో శుక్రవారం నిర్వహించిన సీపీఎం మండల సమావేశంలో మండల నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల కార్యదర్శిగా ఎం.శివన్న ఎన్నికయ్యారు. కార్యక్రమంలో నాయకులు వి.వి. రమణ, ఎస్.వి.రమణ, వేమన్న, శ్రీనివాసులు, చలపతి, అంజి, నాగేంద్రనాయుడు, శ్రీరాములు, వెంకటేశు తదితరులు పాల్గొన్నారు.

పోటీలతో ప్రతిభకు పదును





సామాజిక అంశాలపై విద్యార్థుల్లోని సృజనాత్మకతను వెలికితీసేందుకు 'ఈనాడు - ఈటీవీ' చేస్తున్న కృషి అభినందనీయమని కదిరి బ్లూమూన్ విద్యా సంస్థల ఛైర్మన్ శివశంకర్ పేర్కొన్నారు. శుక్రవారం పాఠశాలలో 'ఈనాడు - ఈటీవీ' ఆధ్వర్యంలో 'ఇంటర్‌నెట్ వినియోగంతో లాభనష్టాలు - సామాజిక మాధ్యమం ప్రభావం' అనే అంశంపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. 75 మంది విద్యార్థులు పాల్గొన్నారు. తొమ్మిదో తరగతి విద్యార్థిని దీక్షితారెడ్డి ప్రథమ, పదో తరగతి విద్యార్థిని యజ్ఞశ్రీ ద్వితీయ, ఎనిమిదో తరగతి విద్యార్థిని నిత్యశ్రీ తృతీయ స్థానాల్లో నిలిచారు. విజేతలకు ఉపాధ్యాయులు సురేంద్రరెడ్డి, మాధవరెడ్డి, మున్వర్‌అలీఖాన్ విద్యార్థులకు బహుమతులు అందించారు. – న్యూస్‌టుడే, కదిరి పట్టణం

వ్యాసం రాసి.. విజేతగా నిలిచి..





ధర్మవరంలోని శాంతినగర్ పురపాలక ఉన్నత పాఠశాలలో శుక్రవారం 'ఈనాడు' ఆధ్వర్యంలో విద్యార్థులకు ప్రతిభాపాటవ పోటీలు నిర్వహించారు. 'ఇంటర్నెట్ వినియోగం వల్ల లాభనష్టాలు - విద్యార్థులపై సామాజిక మాధ్యమం ప్రభావం' అనే అంశంపై వ్యాసరచన పోటీలు జరిగాయి. పోటీల్లో ఎస్.వైష్ణవి (9వ తరగతి), కె.నందిని (10వ తరగతి), ఎస్.గణేశ్ (9వ తరగతి) ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచారు. వారికి ప్రధానోపాధ్యాయుడు సంజీవయ్య బహుమతులు, ధ్రువపత్రాలు అందజేసి మాట్లాడారు. విద్యార్థుల్లో సృజనాత్మకత, విజ్ఞాన వికాసం పెంపుదలకు ప్రతిభాపాటవ పోటీలు దోహదపడతాయన్నారు. ఉపాధ్యాయులు మోహన్‌కృష్ణ, సుధా, శిరీష పాల్గొన్నారు. – న్యూస్‌టుడే, ధర్మవరం

కష్టం ఒకరిది.. వేతనం మరొకరికి

తలుపుల, న్యూస్‌టుడే : కొరుగుట్టపల్లి ప్రాథమిక పాఠశాలలో పనిచేసే మధ్యాహ్న భోజన పథకం ఏజెన్సీ మహిళలకు కాకుండా, పని మానేసిన మహిళల ఖాతాకు మూడు నెలలుగా వేతనాల సొమ్ము జమ చేశారు. ఈ విషయం తెలియడంతో ఆగ్రహించిన బాధిత మహిళలు ఆ పాఠశాలకు తాళం వేసి శుక్రవారం ఉదయం నిరసన తెలపడంతో అధికారులు స్పందించారు. ఆ వేతనాన్ని ఇప్పిస్తామంటూ హామీ ఇచ్చారు. ఈ విషయంపై ఎంఈఓ వెంకటరాముడును వివరణ కోరగా పాత ఏజెన్సీ ఖాతాల్లోనే వేతనాలు జమవుతున్నాయని, వాటిని తిరిగి ఇప్పిస్తామన్నారు. ఇలాంటి పొరపాటు పునరావృతం కాకుండా చూస్తామన్నారు.

అమరవీరులను ఆదర్శంగా తీసుకోండి



పోలీస్ అమరవీరుల త్యాగాలను విద్యార్థులకు వివరిస్తున్న డీఎస్పీ విజయ్ కుమార్

పుట్టపర్తి పట్టణం: అమరవీరుల త్యాగాలను ఆదర్శంగా తీసుకుని విద్యార్థులు దేశసేవకు అంకితం కావాలని డీఎస్పీ విజయ్‌కుమార్ సూచించారు. శుక్రవారం పుట్టపర్తి డీఎస్పీ కార్యాలయంలో నిర్వహించిన పోలీస్ అమరవీరుల దినోత్సవంలో ఆయన మాట్లాడారు. విద్యార్థులు క్రమ శిక్షణతో చదివి పోలీసు, సైన్యంలో ఉద్యోగాలు సాధించి దేశసేవ చేయాలన్నారు. ఈ సందర్భంగా డీఎస్పీ కార్యాలయ కార్యకలాపాల గురించి విద్యార్థులకు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో డీ.ఎస్పీ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ప్లాస్టిక్ కవర్ల విక్రేతలకు జరిమానా

ధర్మవరం పట్టణం, న్యూస్‌టుడే : ప్రభుత్వం నిషేధిత ప్లాస్టిక్ కవర్లను విక్రయిస్తే దుకాణాలపై జరిమానా విధిస్తామని మున్సిపల్ కమిషనర్ ప్రమోద్‌కుమార్ హెచ్చరించారు. శుక్రవారం పట్టణంలో పలు కేంద్రాల్లో అక్రమంగా ప్లాస్టిక్ కవర్లను విక్రయిస్తున్న దుకాణాలపై మున్సిపల్ అధికారులు దాడులు చేశారు. ఈ సందర్భంగా పలు దుకాణాల నుంచి 136 కేజీల ప్లాస్టిక్ కవర్లను స్వాధీనం చేసుకుని రూ.21,500 జరిమానా విధించారు. ఈ కార్యక్రమంలో శానిటేషన్ అధికారి కేశవ తదితరులు పాల్గొన్నారు.

అసాంఘిక కార్యకలాపాలపై నివారణపై అవగాహన



మాట్లాడుతున్న జిల్లా ఎస్పీ రత్న

పుట్టపర్తి పట్టణం, న్యూస్‌టుడే : నేర నియంత్రణలో భాగంగా పోలీసులు గ్రామాల బాటపట్టి అసాంఘిక కార్యకలాపాలపై వారికి అవగాహన కల్పించాలని ఎస్పీ రత్న గ్రామ సచివాలయ పోలీసులకు సూచించారు. శుక్రవారం పుట్టపర్తిలో జిల్లాలోని అన్ని సబ్ డివిజన్ పరిధిలోని మహిళా పోలీసులతో నిర్వహించిన సమావేశంలో ఎస్పీ మాట్లాడారు. పోలీసులు గ్రామస్థులతో మమేకమై కక్షలకు, కార్పణ్యాలకు దూరంగా ఉండి గ్రామాల్లో ప్రశాంతంగా ఉండాలని ,సమస్యలు సృష్టించే వారిపై కఠిన చర్యలు తీసకుంటామని ఎస్పీ హెచ్చరించారు.

అన్నదాతలను ఆదుకోవాలి



మాట్లాడుతున్న సీపీఐ జిల్లా కార్యదర్శి వేమయ్య

పుట్టపర్తి గ్రామీణం, న్యూస్‌టుడే : ఇటీవల కురిసిన భారీ వర్షాలకు పంట నష్టపోయిన రైతన్నలను ఆదుకోవాలని సీపీఐ జిల్లా కార్యదర్శి వేమయ్య ప్రభుత్వాన్ని కోరారు. శుక్రవారం సీపీఐ కార్యాలయంలో నిర్వహించిన వ్యవసాయ కార్మిక సంఘం సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లా వ్యాప్తంగా పలు మండలాల్లో పంటలు వర్షానికి పూర్తిగా దెబ్బతిన్నాయన్నారు. పంటలతోపాటు, పశువులు, ఇళ్లు కూలి ఆస్తి, ప్రాణ నష్టం జరిగిందన్నారు. నష్టాన్ని అంచనా వేసి నష్టపోయిన రైతులు, ప్రజలను అన్ని విధాలా ఆదుకునేలా జిల్లా అధికారులు చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో నాయకులు ఆంజనేయులు, కేశవరెడ్డి, కుళ్లాయప్ప, బాలస్వామి, వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

విజేతలకు ప్రోత్సాహక బహుమతులు



నగదుబహుమతిని అందిస్తున్న డీఎస్పీ శివనారాయణస్వామి

కదిరి పట్టణం, న్యూస్‌టుడే : పోలీసు అమరవీరుల వారోత్సవాలను పురస్కరించుకుని కదిరి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నిర్వహించిన వ్యాసరచన, వక్తృత్వ పోటీల విజేతలకు కదిరి డీఎస్పీ శివనారాయణస్వామి నగదు బహుమతులను ప్రదానం చేశారు. కళాశాల విద్యార్థులకు సైబర్ క్రైమ్, మహిళల సమస్యలు, ర్యాగింగ్, మత్తు పదార్థాల వినియోగంతో కలిగే అనర్థాలపై అవగాహన కల్పించారు. వీటిపై నిర్వహించిన వ్యాసరచన, వక్తృత్వ పోటీల్లో ఆరుగురిని విజేతలకు ప్రకటించి మొదటి బహుమతిగా రూ.2,500, రెండో బహుమతిగా రూ.2,000, మూడో బహుమతికి రూ.1,500 అందజేశారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపల్ శివప్రసాద్, పట్టణ సీఐ నారాయణరెడ్డి, అధ్యాపకులు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

జాతీయస్థాయి పవర్‌లిఫ్టింగ్ పోటీల్లో పతకం



సువర్ణను అభినందిస్తున్న డైరెక్టర్ గుప్త, అధ్యాపకులు

వేంపల్లె, న్యూస్‌టుడే: జాతీయస్థాయి పవర్‌లిఫ్టింగ్ పోటీల్లో ఇడుపులపాయ ట్రిపుల్‌ఐటీ విద్యార్థిని బెంగళూరు సువర్ణ కాంస్యపతకం సాధించింది. శ్రీసత్యసాయి జిల్లా పుట్టపర్తికి చెందిన ఆమె ట్రిపుల్‌ఐటీలో ఇంజినీరింగ్ మొదటి సంవత్సరం చదువుతోంది. ఈ నెల 14 నుంచి 18 వరకు గోవాలో జరిగిన పోటీల్లో ఆమె ప్రతిభ చాటి పతకం గెలుచుకుంది. విద్యార్థినిని శుక్రవారం డైరెక్టర్ కుమారస్వామి గుప్త, ట్రిపుల్‌ఐటీ ఎస్టాబ్లిష్‌మెంట్ బాధ్యుడు సుధాకర్‌రెడ్డి, పీడీ బాల ఓబయ్య, ఏపీ పవర్‌లిఫ్టింగ్ జట్టు కోచ్ బాలగోవింద్‌తివారీ అభినందించారు.

ట్రాక్టర్ బోల్తా.. సర్పంచి కుమారుడి దుర్మరణం



దామోదర్ (పాత చిత్రం)

ధర్మవరం, న్యూస్‌టుడే : ధర్మవరం మండలం ఏలుక్కుంట్లలో ట్రాక్టర్ తిరగబడి శుక్రవారం గ్రామ సర్పంచి గంగమ్మ కుమారుడు దామోదర్ (35) మృతి చెందాడు. వ్యవసాయపొలంలో అతను ట్రాక్టర్‌తో పని చేస్తుండగా ప్రమాదవశాత్తూ ట్రాక్టర్ తిరగబడింది. ట్రాక్టర్ కిందపడి అక్కడికక్కడే అతను మృతి చెందాడు. అతనికి భార్య ఈశ్వరమ్మ, ఒక కుమారుడు, ఒక కుమార్తె ఉన్నారు. దామోదర్ తల్లి గ్రామ సర్పంచిగా ఉన్నారు. కుమారుడి మృతితో ఆమె కన్నీటి పర్యంతమయ్యారు. ధర్మవరం గ్రామీణ పోలీసులు కేసు నమోదు చేసుకుని విచారణ చేస్తున్నారు.

ఎడ్లబండ్ల పోటీలు తిలకించి వెళ్తూ ..

సోమందేపల్లి: వెలగమేకలపల్లి మలుపు సమీపంలో శుక్రవారం జరిగిన ఎడ్లబండ్ల పోటీలను పుట్టపర్తి మండలం నిడిమామిడికి చెందిన రామాంజనేయులు(40) ఉత్సాహంగా తిలకించి వెళ్తూ గోరంట్లలో గుండె పోటుతో మృతి చెందాడు. గోరంట్లలో ఉన్న తన అల్లుడు రాజు ఎద్దులు ఈ పోటీల్లో ఫైనల్‌కు చేరడం.. చీకటి పడటంతో శనివారం రావాలని నిర్వాహకులు చెప్పడంతో బయలుదేరారు. గుండెల్లో నొప్పిగా ఉందని బంధువులకు చెప్పడంతో అక్కడి ఆసుపత్రికి తరలించగా ఆయన మృతి చెందినట్లు చెప్పారు.

నిప్పంటించుకున్న వ్యక్తి..

తనకల్లు, న్యూస్‌టుడే : మండలంలోని మారప్పగారిపల్లికి చెందిన వెంకటరమణ (36) గురువారం ఒంటిపై పెట్రోల్ పోసుకుని నిప్పంటించుకోగా చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. వెంకటరమణ ఇంటి ఎదురింట్లో నివాసం ఉంటున్న నరసింహులు రెండు కుటుంబాల మధ్య మురుగు సమస్య కారణంగా గొడవలు చోటుచేసుకున్నాయి. దీంతో మనస్తాపం చెందిన వెంకటరమణ పెట్రోల్ పోసుకుని నిప్పంటించుకోవడంతో తీవ్రంగా గాయపడ్డాడు. బంధువులు తిరుపతిలోని రుయా ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ శుక్రవారం మృతిచెందాడు. ఈ విషయంపై ఎస్‌ఐ గోపిని వివరణ అడగ్గా బాధితుల నుంచి ఇంకా ఫిర్యాదు అందలేదన్నారు.

వేర్వేరు ప్రమాదాల్లో పలువురికి గాయాలు

తాడిమర్రి, న్యూస్‌టుడే : మండల పరిధిలోని చిల్లకొండాయపల్లి గ్రామ సమీపాన శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో పూలకుంటకు చెందిన చిన్నప్పకు తీవ్రగాయాలయ్యాయి. శుక్రవారం పోలీసులు తెలిపి వివరాల మేరకు.. అతను శుక్రవారం గ్రామ సమీపంలోని అడవిలోకి గొర్రెలను మేపేందుకు వెళ్తున్నాడు. అదే సమయంలో పులివెందుల నుంచి వస్తున్న గ్యాస్ సిలిండర్ల వాహనం వేగంగా వచ్చి అతన్ని ఢీకొంది. జరిగిన ఘటనను ఆ వాహన చోదకుడు గ్రామస్థులకు తెలిపాడు. గ్రామస్థులు ఘటనా స్థలానికి చేరుకుని క్షతగాత్రున్ని బత్తలపల్లి ఆర్‌డీటీ ఆసుపత్రికి, తరువాత అనంతపురంలోని ప్రైవేట్ ఆసుపత్రికి బంధువులు తీసుకెళ్లారు. పోలీసులు ప్రమాద ఘటనపై విచారణ చేస్తున్నారు.

ధర్మవరం, న్యూస్‌టుడే : ధర్మవరంలోని గుట్టకిందపల్లి పెట్రోలు బంకు వద్ద శుక్రవారం ద్విచక్ర వాహనాన్ని కారు ఢీకొన్న ఘటనలో కొత్తచెరువు పోలీసుస్టేషన్‌లో కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న ఉపేంద్ర గాయపడ్డాడు. అనంతపురం నుంచి ద్విచక్రవాహనంలో కానిస్టేబుల్ ధర్మవరానికి వస్తుండగా అదే మార్గంలో వచ్చిన కారు ఢీకొంది. ఉపేంద్ర తలకు గాయమైంది. స్థానికులు అతన్ని అనంతపురంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. ప్రమాద ఘటనపై ధర్మవరం 2వ పట్టణ పోలీసులు కేసు నమోదు చేసుకుని విచారణ చేస్తున్నారు.

తలుపుల, న్యూస్‌టుడే : మండలంలోని పెద్దన్నవారిపల్లి పంచాయతీ వేమలగొంది కొట్టాల సమీపాన శుక్రవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్రగాయాలైనట్లు ఎస్‌ఐ నరసింహులు తెలిపారు. కడప జిల్లా సిద్ధారెడ్డిగారిపల్లికి చెందిన రామాంజనేయులు పనిపై తలుపులకు వచ్చి తిరిగి స్వగ్రామానికి వెళ్తుండగా ఎదురుగా వస్తున్న మరో ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టారు. దీంతో అతనికి గాయాలయ్యాయి. మొదట వేంపల్లి ఆసుపత్రికి, అక్కడ నుంచి కడప రిమ్స్‌కి అతన్ని తరలించారు. మరో ద్విచక్ర వాహనంలోని గోరంట్లకు చెందిన వ్యక్తికి గాయమైంది. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ నరసింహుడు తెలిపారు.

కదిరి పట్టణం, న్యూస్‌టుడే : ముందు వెళ్తున్న లారీని ఢీకొన్న ప్రమాదంలో ద్విచక్ర వాహన చోదకుడు శ్రీనాథ్ గాయపడ్డారు. నల్లమాడ మండలం బడవాండ్లపల్లికి చెందిన అతను కదిరి నుంచి గ్రామానికి బయలుదేరాడు. వాహనం వేగాన్ని నియంత్రించుకోలేక కదిరి పట్టణం కుటాగుళ్ల వద్ద ముందు వెళ్తున్న లారీని ఢీకొట్టి కిందపడిపోయాడు. స్థానికులు గుర్తించి 108 వాహనం సాయంతో కదిరి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

పొంచి ఉన్న ప్రమాదం



ధర్మవరంలోని సంజయ్‌నగర్ బీఎస్ఆర్ పురపాలక ఉన్నత పాఠశాల పక్కన విద్యుత్తు నియంత్రిక ప్రమాదకరంగా ఉంది. నియంత్రిక చుట్టూ పచ్చని చెట్లు పెరిగి నియంత్రిక ఫ్యూజ్‌లకు అల్లుకుపోయాయి. ఈ మార్గంలో విద్యార్థులు రాకపోకలు చేస్తున్నారు. పొరపాటున పచ్చని చెట్టు తీగలు విద్యార్థులు తాకితే విద్యుదాఘాతానికి గురయ్యే ప్రమాదం ఇక్కడ పొంచి ఉంది. నియంత్రికకు రక్షణ కంచె ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు. నియంత్రిక వద్ద పెరిగిన చెట్ల కొమ్మలు తొలగించేలా చర్యలు తీసుకుంటామని విద్యుత్‌శాఖ ఏఈ నాగభూషణ పేర్కొన్నారు. – న్యూస్‌టుడే, ధర్మవరం

రాకపోకలకు ఇక్కట్లు

ముదిగుబ్బలోని రైల్వేస్టేషన్‌కు వెళ్లే మార్గంలో రహదారిపై వాహనాలు ఇష్టారాజ్యంగా పార్కింగ్ చేస్తుండటంతో రాకపోకలకు వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వ్యాపార దుకాణాల ముందు అడ్డదిడ్డంగా వాహనాలు నిలుపుతున్నారు. దీంతో కిరాణ, కూల్‌డ్రింక్ దుకాణాలకు సరకులు తీసుకొచ్చే వాహనాలు వచ్చేందుకు దారిలేక ఆమడదూరంలోనే నిలబడిపోతున్నాయని దుకాణదారులు వాపోతున్నారు. ట్రాఫిక్ సమస్యపై పోలీసులు దృష్టిసారించాలని కోరుతున్నారు. వీటిపై ముదిగుబ్బ గ్రామీణ సీఐ శ్యామారావును వివరణ కోరగా ఎక్కడపడితే అక్కడ పార్కింగ్ చేయకూడదని వాహనదారులు అవగాహన కల్పిస్తామని తెలిపారు.– న్యూస్‌టుడే, ముదిగుబ్బ



గుంతల దారిపై అవస్థలు



కదిరి నుంచి పందలకుంట గ్రామానికి వెళ్లే సుమారు 8 కిలోమీటర్ల రహదారి కంకత తేలి, గుంతలు ఏర్పడి అధ్వానంగా ఉంది. జౌకల, చలమకుంట్లపల్లి, పందలకుంట గ్రామాలకు చెందిన ప్రజలు, రైతులు, విద్యార్థులు నిత్యం ఈ రహదారిపైనే రాకపోకలు సాగిస్తున్నారు. రహదారి కంకర తేలి, గుంతలు ఏర్పడటంతో వారు రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలని వారు కోరుతున్నారు. ఈ విషయాన్ని పంచాయతీ రాజ్ శాఖ ఏఈ హనుమంతయ్య శెట్టి దృష్టికి తీసుకెళ్లగా, రహదారి మరమ్మతులకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపామని, నిధుల రాగానే పనులు చేపడతామన్నారు. – న్యూస్‌టుడే, కదిరి గ్రామీణం

అధికారులు స్పందించారా?

పుట్టపర్తి మున్సిపాలిటీ పరిధిలోని పెద్దకుమ్మవారిపల్లి ప్రజలు మురుగులో రాకపోకలు సాగించాల్సిన దుస్థితి ఏర్పడింది. చిన్నపాటి వర్షం వచ్చినా రహదారిపై నీరు నిలుస్తున్నాయి. మరో మార్గం లేకపోవడంతో పాదచారులు, వాహనదారులు నీటిలో రాకపోకలు సాగించలేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పాలకులు, అధికారులు సమస్యను చూసి వెళ్లడం తప్ప, పరిష్కారానికి చర్యలు తీసుకున్న దాఖలాలు లేవని స్థానికులు మండిపడుతున్నారు. ఇప్పటికైన సంబంధిత పాలకులు, అధికారులు, స్పందించి సమస్యకు పరిష్కారం చూపాలని స్థానికులు కోరుతున్నారు. రహదారిలో నీటి నిల్వ లేకుండా తగు చర్యలు తీసుకుంటున్నామని మున్సిపల్ కమిషర్ ప్రహ్లాద తెలిపారు.



– నూస్‌టుడే, పుట్టపర్తి

మురుగులో తాగునీటి పైపులైన్



ధర్మవరంలోని తాగునీటి శుద్ధి కేంద్రం నుంచి ఏర్పాటు చేసిన పైపులైన్ శంకరాపురం వద్ద మురుగు కాలువపై ఉంది. మురుగు పైపులైన్‌ను తాకుతూ పారుతోంది. తాగునీటి పైపులైన్ వద్ద చెత్త, మురుగు పేరుకుపోయాయి. తాగునీటి పైపులైన్‌కు ఏమాత్రం లీకేజీ ఏర్పడినా మురుగు అందులోకి వెళ్లే ప్రమాదం ఉందని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. దాన్ని పరిశీలించి మురుగు నిలవకుండా చర్యలు చేపడతామని పురపాలక కమిషనర్ ప్రమోద్‌కుమార్ పేర్కొన్నారు. – న్యూస్‌టుడే, ధర్మవరం